# తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

వరంగల్ | శనివారం - 21- మార్చి 2026 | సంపుటి : 3 | సంచిక : 292 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


# సంకల్పంతో రూపుదిద్దుకున్న తెలంగాణ బడ్జెట్




**సమగ్రాభివృద్ధికి బ్లూప్రింట్**


**రూ. 3.24 లక్షల కోట్ల భారీ ప్రణాళిక**

## ప్రతి వర్గానికి సంక్షేమం–అభివృద్ధి లక్ష్యం

## రైతు, మహిళ, యువతకు ప్రత్యేక ప్రాధాన్యం



హైదరాబాద్, మార్చి 20 (తెలంగాణ ముచ్చట్లు): రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజల సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకుని తెలంగాణ ప్రభుత్వం 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ. 3,24,234 కోట్ల భారీ బడ్జెట్‌ను ప్రతిపాదించింది. రైతు సంక్షేమం, మహిళల సాధికారత, యువతకు ఉపాధి అవకాశాలు, నాణ్యమైన విద్య, ఆరోగ్యం, మౌలిక వసతుల అభివృద్ధి వంటి అన్ని కీలక రంగాలకు సమతుల్యంగా కేటాయింపులు చేస్తూ ఈ బడ్జెట్ రూపొందించబడింది. పేద, మధ్యతరగతి, ధనిక అనే తేడా లేకుండా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరే విధంగా ప్రభుత్వం ఈ బడ్జెట్‌ను రూపొందించినట్లు వెల్లడించింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రిమండలి సమావేశంలో బడ్జెట్‌కు ఆమోదం లభించగా, ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క శాసనసభలో ప్రవేశపెట్టారు. పాలకులుగా కాకుండా ప్రజాసేవకులుగా పరిపాలన సాగిస్తున్నామని, ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అందించడమే లక్ష్యమని ప్రభుత్వం స్పష్టం చేసింది. రాజ్యాంగ విలువలకు కట్టుబడి పారదర్శక పాలన అందిస్తున్నామని పేర్కొంది.



ఈ బడ్జెట్‌లో అత్యంత కీలక ఆకర్షణగా "ఇందిరమ్మ కుటుంబ జీవన బీమా" పథకాన్ని ప్రవేశపెట్టింది. రాష్ట్రంలోని 1 కోటి 15 లక్షల కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా కల్పించనుంది. అదేవిధంగా చేయూత పథకం కింద 2 లక్షల కొత్త పెన్షన్లు మంజూరు చేయడం, మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం కొనసాగించడం, రూ.500కే గ్యాస్ సిలిండర్ అందించడం, గృహజ్యోతి ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించడం వంటి పథకాలు కొనసాగుతున్నాయి. మహిళా శక్తి మిషన్ ద్వారా కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యాన్ని ప్రభుత్వం ప్రకటించింది. విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులకు బడ్జెట్ దారితీసింది. ప్రీప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని విస్తరించడం ద్వారా విద్యార్థుల పోషకాహార స్థాయిని మెరుగుపరచనుంది. రాష్ట్రంలోని 57 పాలిటెక్నిక్ కాలేజీలను ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా మార్చి, కొత్తగా 15 కోర్సులను ప్రవేశపెట్టనుంది. ఏటీసీల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు నెలకు రూ.2,000 స్కాలర్‌షిప్ అందించనుంది. 105 యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలు నిర్మించడంతో పాటు ప్రాథమిక విద్యను బలోపేతం చేయడానికి 2,500 పాఠశాలలకు

మిగతా 2లో

| | |
|---|---|
| తెలంగాణ వార్షిక బడ్జెట్ | రూ.3,24,234 కోట్లు |
| రెవెన్యూ వ్యయం | రూ.2,34,406 కోట్లు |
| మూలదన వ్యయం | రూ. 47, 267 కోట్లు |
| గతేడాది కంటే | రూ.20 వేల కోట్లు అధికం |

**శాఖల వారీగా కేటాయింపులు (రూ. కోట్లలో)**

| | |
|---|---|
| విద్యాశాఖ | 26,674 |
| వైద్యారోగ్య శాఖ | 13,679 |
| హోం శాఖ | 11,907 |
| వ్యవసాయ శాఖ | 23,179 |
| విద్యుత్ శాఖ - | 21,285 |
| పౌరసరఫరాల శాఖ | 7,366 |
| స్త్రీ, శిశు సంక్షేమం | 3,143 |
| ఎస్సీ అభివృద్ధి- | 11,784 |
| ఎస్టీ అభివృద్ధి | 7,937 |
| మైనారిటీ సంక్షేమం | 3769 |
| ఇరిగేషన్ | 22, 615 |
| మున్సిపల్ శాఖ | 17,907 |
| పశుసంవర్ధక శాఖ | 1,529 |
| రాజీవ్ యువ వికాసం | 6,000 |
| గృహ నిర్మాణం | 7,430 |
| ఐటీ శాఖ | 875 |
| చేనేత, జౌళి శాఖ | 258 |
| పరిశ్రమల శాఖ | 3,490 |
| పంచాయతీ రాజ్ - | 33,688 |
| ఆర్ అండ్ బీ | 12,789 |
| న్యాయ శాఖ | 2,367 |
| టూరిజం- | 1,224 |

**గోదావరి పుష్కరాలకు రూ. 500 కోట్లు కేటాయింపు**

**ఆరు గ్యారంటీలకు రూ.50,713 కోట్లు**

| | |
|---|---|
| గృహజ్యోతి | రూ.2,080 కోట్లు |
| రాజీవ్ ఆరోగ్యశ్రీ | రూ.1,143 కోట్లు |
| మహాలక్ష్మి గ్యాస్ సబ్సిడీ | రూ.723 కోట్లు |
| ఇందిరమ్మ ఆత్మీయ భరోసా | రూ.600 కోట్లు |
| రైతు భరోసా | రూ.18 వేల కోట్లు |
| చేయూత | రూ.14,861 కోట్లు |
| ఇందిరమ్మ ఇళ్లు | రూ.5,500 కోట్లు |
| మహాలక్ష్మి పథకం | రూ.4,305 కోట్లు |
| వ్యవసాయ ఉత్పత్తులకు బోనస్ | రూ.3,500 కోట్లు |
| విద్యుత్ రాయితీ | రూ.14 వేల కోట్లు |
| కల్యాణలక్ష్మి పథకం | రూ.3,683 కోట్లు |
| ఉపకారవేతనాలు | రూ.4,343 కోట్లు |



## గన్‌పార్క్ వద్ద బీఆర్ఎస్ నిరసన

- ఆరు గ్యారంటీలపై కాంగ్రెస్‌పై ఆగ్రహం
- చట్టబద్ధత కల్పించాలని డిమాండ్
- హామీలు అమలు చేయలేదని విమర్శలు
- వివిధ వర్గాల సమస్యలపై నిలదీత

హైదరాబాద్, మార్చి 20 (తెలంగాణ ముచ్చట్లు):

రాష్ట్రంలో ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గన్‌పార్క్ వద్ద నిరసన చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని వారు విమర్శించారు. ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులతో ఆందోళన వ్యక్తం చేశారు. నిరసన సందర్భంగా నేతలు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలు కాలేదని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లాల్సిన ప్రభుత్వం హామీలను విస్మరించిందని ఆరోపించారు. ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా రాష్ట్రాన్ని ఆగం చేశారని పేర్కొన్నారు.

మిగతా 2లో

## అంతర్జాతీయ ప్రమాణాలతో విపత్తుల శిక్షణా కేంద్రం ఏర్పాటు దిశగా అడుగులు

- ఎస్ఐడీఎం స్థాపనకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశాలు
- ముందస్తు సన్నద్ధతతో నష్టాల తగ్గింపు లక్ష్యం
- అత్యాధునిక పరికరాలతో విపత్తు నిర్వహణ బలోపేతం

హైదరాబాద్, మార్చి 20 (తెలంగాణ ముచ్చట్లు):

రాష్ట్రంలో విపత్తుల నిర్వహణను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు అంతర్జాతీయ ప్రమాణాలతో శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. డా. బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో విపత్తుల నిర్వహణ విభాగం, అగ్నిమాపక శాఖ, ఎస్‌డిఆర్ఎఫ్, హైడ్రా, ఐసిసిసి విభాగాల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు.



మిగతా 2లో



## భద్రాచలం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

- అంతర్జాతీయ ఆధ్యాత్మిక కేంద్రంగా రూపాంతరం
- మూడు దశల్లో ఆలయ అభివృద్ధి పనులు
- పుష్కరాల నాటికి తొలి దశ పూర్తి లక్ష్యం
- ట్రైబల్ మ్యూజియం, పరిసర దేవాలయాల అభివృద్ధి

హైదరాబాద్, మార్చి 20 (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో భద్రాద్రిని అంతర్జాతీయ స్థాయి ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నామని రాష్ట్ర మంత్రులు తెలిపారు. ఆలయ రూపురేఖలను మార్చేలా సమగ్ర మాస్టర్ ప్లాన్ రూపొందించినట్లు వెల్లడించారు. ఈ మాస్టర్ ప్లాన్‌పై శుక్రవారం సచివాలయంలో

మిగతా 2లో

## మద్యం కుంభకోణం కేసులో అవినాశ్ రెడ్డికి బెయిల్

- సుప్రీంకోర్టు ఊరట
- ఏ7 నిందితుడిగా ఉన్న అవినాశ్‌కు రిలీఫ్
- సిట్ విచారణలో కీలక విషయాలు వెలుగులోకి
- కేసులో విచారణ వేగవంతం

2లో



## మీ ప్రత్యేకతతోనే విజయం సాధ్యం

- గ్రూప్-1 అధికారులకు హైడ్రా కమిషనర్ సూచనలు
- ప్రజాప్రయోజనమే పరిపాలనలో లక్ష్యంగా ఉండాలి
- పారదర్శకతతో ప్రజల్లో నమ్మకం పెంచాలి
- చేతల్లోనే ఫలితాలు చూపాలని స్పష్టీకరణ

2లో

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# సంకల్పంతో రూపుదిద్దుకున్న తెలంగాణ బడ్జెట్



(మొదటి పేజీ తరువాయి)

ప్రీప్రైమరీ విభాగాలను విస్తరించనుంది. వ్యవసాయ రంగానికి రూ.23,179 కోట్లు కేటాయిస్తూ రైతు భరోసా పథకం ద్వారా ప్రతి ఎకరాకు సంవత్సరానికి రూ.12 వేల పెట్టుబడి సహాయం అందించనుంది. సన్న వడ్లకు క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వనుంది. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 3.18 కోట్ల లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ కొనసాగుతుంది. సాగునీటి ప్రాజెక్టులకు రూ.22,615 కోట్లు కేటాయించి పలు ఎత్తిపోతల పథకాలు, పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. విద్యుత్ రంగానికి రూ.21,285 కోట్లు, విద్యా రంగానికి రూ.26,674 కోట్లు, వైద్య ఆరోగ్య రంగానికి రూ.13,679 కోట్లు కేటాయించింది. ఆరోగ్య రంగంలో ప్రజల హెల్త్ ప్రొఫైల్ సిద్ధం చేయడం, కొత్తగా 17 మెడికల్ కాలేజీలు నిర్మించడం, సనత్‌నగర్, ఎల్‌బీనగర్, అల్వాల్ ఆసుపత్రులు, వరంగల్ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను ప్రారంభించనుంది. ఉద్యోగులు, పెన్షనర్లకు నగదు రహిత ఆరోగ్య భద్రత పథకాన్ని అమలు చేయనుంది.

పట్టణాభివృద్ధి, మౌలిక వసతుల అభివృద్ధికి కూడా పెద్దపీట వేసింది. మూసీ నది పునరుద్ధరణ, గోదావరి నీటిని తరలించడం, 39 ఎస్టీపీల నిర్మాణం, రీజినల్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రైలు, కొత్త విమానాశ్రయాల అభివృద్ధి వంటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించింది. భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణం, పారిశ్రామిక హబ్‌లు, ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ల అభివృద్ధి ద్వారా రాష్ట్రాన్ని ఆర్థికంగా బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

హోం శాఖకు రూ.11,907 కోట్లు కేటాయించి శాంతిభద్రతల పరిరక్షణ, మాదకద్రవ్యాల నిర్మూలనపై దృష్టి సారించింది. 2027 గోదావరి పుష్కరాల నిర్వహణకు రూ.500 కోట్లు కేటాయించింది. క్రీడలు, పర్యాటక రంగాల అభివృద్ధి ద్వారా రాష్ట్రాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే ప్రణాళికలు రూపొందించింది. మొత్తంగా ఈ బడ్జెట్‌ను తెలంగాణ ప్రజల ఆశలు, ఆశయాలకు ప్రతిబింబంగా ప్రభుత్వం పేర్కొంది. సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమన్వయం చేస్తూ ఆర్థిక క్రమశిక్షణతో ముందుకు సాగే విధంగా రూపొందించిన ఈ బడ్జెట్ రాష్ట్ర భవిష్యత్తుకు మార్గదర్శిగా నిలుస్తుందని ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

# అంతర్జాతీయ ప్రమాణాలతో విపత్తుల శిక్షణా కేంద్రం ఏర్పాటు దిశగా అడుగులు

(మొదటి పేజీ తరువాయి)



విపత్తులు సంభవించినప్పుడు కేవలం సహాయక చర్యలకే పరిమితం కాకుండా, ముందస్తు సన్నద్ధతతో నష్టాన్ని తగ్గించడం అత్యంత అవసరమని మంత్రి పేర్కొన్నారు. ఈ దిశగా 'స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్' (ఎస్ఐడీఎం) స్థాపనకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఈ ప్రతిపాదనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. విపత్తుల నిర్వహణలో తెలంగాణను దేశానికి ఆదర్శంగా నిలపాలంటే అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి స్పష్టం చేశారు. అగ్నిప్రమాదాలు, వరదలు, ఇతర అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు వేగవంతమైన స్పందన వ్యవస్థ అవసరమని పేర్కొన్నారు. రియల్ టైమ్ మానిటరింగ్, ఖచ్చితమైన సమాచార వ్యవస్థ, ఆధునిక సాంకేతికత వినియోగం ద్వారా విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనవచ్చని తెలిపారు. అత్యాధునిక పరికరాల కొనుగోలు, డ్రోన్‌లు, హైస్పీడ్ బోట్లు వంటి సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి సూచించారు. క్షేత్రస్థాయిలో విపత్తులను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంపొందించేందుకు శిక్షణా కార్యక్రమాలను విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. విపత్తుల నివారణలో శాస్త్రీయ పద్ధతులను అనుసరించడం ద్వారా ప్రాణ, ఆర్థిక నష్టాలను తగ్గించవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి దానకిశోర్, అగ్నిమాపక శాఖ డైరెక్టర్ విక్రమాన్ సింగ్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఐసిసిసి డైరెక్టర్ కమలాసన్ రెడ్డి, స్పెషల్ పోలీస్ బెటాలియన్ అదనపు డీజీ సంజయ్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

# గన్‌పార్క్ వద్ద బీఆర్ఎస్ నిరసన

(మొదటి పేజీ తరువాయి)

దివ్యాంగులకు ఇవ్వాల్సిన రూ.54,000 బాకీ ఎక్కడ అని నేతలు ప్రశ్నించారు. వృద్ధులకు నెలకు రూ.4,000 చొప్పున ఇవ్వాల్సిన సాయం కూడా అందడం లేదని తెలిపారు. ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12,000 చొప్పున ఇవ్వాల్సిన సహాయం రెండు సంవత్సరాలకు రూ.24,000గా బాకీ పడిందని ఆరోపించారు. ఈ వర్గాలన్నీ తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని చెప్పారు. నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఇచ్చిన హామీ ఏమైందని నేతలు నిలదీశారు. నిరుద్యోగ భృతి ఎక్కడుందని ప్రశ్నించారు. పేదింటి ఆడబిడ్డలకు తులం బంగారం ఇస్తామని చెప్పి అమలు చేయకపోవడం కూడా నిరాశ కలిగించిందని పేర్కొన్నారు. యువత, మహిళలు ప్రభుత్వంపై నమ్మకం కోల్పోతున్నారని అన్నారు. రాష్ట్ర సంపదను దోచుకుంటూ ప్రజలను గాలికి వదిలేసిందని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేసి ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



# భద్రాచలం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి కొండా సురేఖ కార్యాలయంలో కీలక సమావేశం జరిగింది. ఇందులో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, వాకాటి శ్రీహరి పాల్గొన్నారు. రెండు వందల సంవత్సరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, ఆగమ శాస్త్రానికి అనుగుణంగా భక్తుల భావోద్వేగాలను గౌరవిస్తూ అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించారు. మూడు దశల్లో ఆలయ అభివృద్ధి చేపట్టాలని ప్రణాళిక రూపొందించారు. వచ్చే గోదావరి పుష్కరాల నాటికి పుష్కర ఘాట్‌తో పాటు మొదటి దశ పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించేలా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. భద్రాచలాన్ని తెలంగాణలోనే అతి పెద్ద ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమని మంత్రులు పేర్కొన్నారు. భద్రాచలం సమీపంలోని రామవరం ప్రాంతంలో ట్రైబల్ మ్యూజియం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గిరిజన సంస్కృతిని ప్రతిబింబించే విధంగా ఈ మ్యూజియాన్ని అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా గోదావరి పుష్కరాల సందర్భంగా కొరివి వీరభద్రస్వామి, మల్లూరు నరసింహస్వామి దేవాలయాలను కూడా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన సమావేశంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. భక్తులకు మరింత సౌకర్యవంతమైన దర్శనాన్ని కల్పించడం, ఆధ్యాత్మిక పర్యాటకాన్ని ప్రోత్సహించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.



# మీ ప్రత్యేకతతోనే విజయం సాధ్యం



**హైదరాబాద్, మార్చి 20 (తెలంగాణ ముచ్చట్లు):** గ్రూప్ 1కు ఎంపికైన కొత్త అధికారులకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ కీలక దిశానిర్దేశం చేశారు. ఎంతో కష్టపడి సాధించిన ఈ అవకాశాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి అధికారికి తన విభాగంలో ప్రత్యేకత చూపించాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకం పెంచే విధంగా ప్రతి నిర్ణయం ఉండాలని, పారదర్శకతతో పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. డా. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతూ, ప్రజాప్రయోజనమే పరిపాలనలో ప్రధాన లక్ష్యంగా ఉండాలని ఆయన చెప్పారు. ప్రజలకు సరైన అవగాహన కల్పిస్తే పరిపాలన సులభమవుతుందని, వారి మద్దతు కూడా పెరుగుతుందని వివరించారు. చరిత్రను అనుసరించడమే కాకుండా, ప్రతి అధికారి తనదైన ముద్ర వేసేలా కొత్త చరిత్రను సృష్టించాలని సూచించారు. హైడ్రా సంస్థ ప్రారంభంలో ఎదుర్కొన్న సవాళ్లను కూడా రంగనాథ్ వివరించారు. మొదట్లో ప్రజల్లో సంస్థపై నెగిటివ్ అభిప్రాయం ఎక్కువగా ఉండేదని, అయితే ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారిందన్నారు. ప్రస్తుతం 85 శాతం మంది హైడ్రా పనితీరుపై సానుకూల దృక్పథంతో ఉన్నారని తెలిపారు. ఇది కేవలం మాటల్లో కాదు, గ్రౌండ్ స్థాయిలో ఫలితాలు చూపించడంవల్లే సాధ్యమైందని చెప్పారు. చట్టాలు కేవలం పేపర్‌పై ఉండటం వల్ల ప్రయోజనం లేదని, వాటిని అమలు చేయడమే ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. నగరంలో చెరువుల పునరుద్ధరణ, కాలువల పరిరక్షణ, ఆక్రమణల తొలగింపు వంటి చర్యల ద్వారా స్పష్టమైన మార్పులు తీసుకువచ్చామని చెప్పారు. గతంలో విమర్శించినవారే ఇప్పుడు అభినందిస్తున్నారని, ప్రజలకు ఉపయోగపడే విధంగా పని చేస్తే ఫలితాలు కనిపిస్తాయని పేర్కొన్నారు. ముగింపులో ప్రజలతో మమేకమవ్వడం ఎంతో ముఖ్యమని హైడ్రా కమిషనర్ సూచించారు. ప్రజావాణి వంటి కార్యక్రమాల ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తే పరిపాలన సులభమవుతుందని చెప్పారు. ఎక్కడ పని చేసినా నిబద్ధతతో, సమర్థతతో బాధ్యతలు నిర్వహించాలని సూచించారు. హైడ్రా పనితీరు తమకు మార్గదర్శకంగా ఉంటుందని కొత్తగా ఎంపికైన అధికారులు అభిప్రాయపడ్డారు.



# పేదల ఆకలి తీర్చడం గొప్ప పుణ్యం

- **తలసాని శ్రీనివాస్ యాదవ్**
- **సనత్‌నగర్‌లో భోజన పంపిణీ, చలివేంద్రాల ప్రారంభం**
- **సీనియర్ సిటిజన్ సేవలకు ఎమ్మెల్యే ప్రశంసలు**
- **వేసవిలో సేవా కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి**

**హైదరాబాద్, మార్చి 20 (తెలంగాణ ముచ్చట్లు):** ఆకలితో అలమటిస్తున్న పేదలకు అన్నం పెట్టడం అత్యంత గొప్ప పుణ్యకార్యమని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. సనత్‌నగర్‌లోని బికె గూడ పార్క్ వద్ద శ్రీనివాస సమాజ సేవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన మధ్యాహ్న భోజన పంపిణీ, చలివేంద్రాల కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున ప్రజలు, సేవా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మాట్లాడుతూ, 2011 సంవత్సరం నుంచి ప్రతి ఏడాది వేసవి కాలంలో సుమారు 70 రోజులపాటు పేదలకు రుచికరమైన భోజనం అందిస్తున్నారని గుర్తు చేశారు. నిరంతరం ఈ సేవా కార్యక్రమాన్ని కొనసాగించడం ఎంతో గొప్ప విషయమని అభినందించారు. ముఖ్యంగా ఉద్యోగ విరమణ అనంతరం కూడా వయసును పట్టించుకోకుండా సమాజ సేవలో నిమగ్నమవుతున్న వారి సేవాభావాన్ని ప్రశంసించారు.

రాష్ట్రంలో అనేకమంది సీనియర్ సిటిజన్లు ఉన్నప్పటికీ, సనత్‌నగర్ ప్రాంతంలోని వృద్ధులు చేపడుతున్న సేవా కార్యక్రమాలు ప్రత్యేకంగా నిలుస్తున్నాయని ఆయన అన్నారు. కుటుంబంతో గడపాల్సిన సమయంలో సమాజ సేవకు ప్రాధాన్యం ఇవ్వడం గొప్ప సంకల్పమని పేర్కొన్నారు. వారి కృషి ఇతరులకు స్ఫూర్తిగా మారాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక్కడ భోజనం తీసుకుంటున్న పేదలు జీవితాంతం ఈ సేవను గుర్తుంచుకుంటారని తలసాని తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మానవత్వాన్ని పెంపొందిస్తాయని అన్నారు. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సీనియర్ సిటిజన్లు తన గుండెల్లో ప్రత్యేక స్థానం పొందారని పేర్కొన్నారు. వారి ఆశీస్సులు తనపై ఎల్లప్పుడూ ఉండాలని కోరారు. అదేవిధంగా, తనను కలిసేందుకు వచ్చే వారు శాలువాల కోసం డబ్బు ఖర్చు చేయవద్దని సూచించారు. ఆ డబ్బును సేవా కార్యక్రమాలకు వినియోగిస్తే మరింత ప్రయోజనం ఉంటుందని చెప్పారు. వేసవిలో తీవ్రమైన ఎండలు ఉన్నందున ఆరోగ్య పరిరక్షణపై ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా సమాజ సేవకు మరో మంచి ఉదాహరణ నిలిచిందని పేర్కొన్నారు.

# మద్యం కుంభకోణం కేసులో అవినాశ్ రెడ్డికి బెయిల్

**న్యూఢిల్లీ, మార్చి 20 (తెలంగాణ ముచ్చట్లు):**

ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో ఏ7 నిందితుడిగా ఉన్న ముప్పిడి అవినాశ్ రెడ్డికి సుప్రీంకోర్టు భారీ ఊరట కల్పించింది. ఆయనకు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసింది. దీంతో ఇప్పటివరకు రిమాండ్‌లో ఉన్న అవినాశ్ రెడ్డి త్వరలో జైలు నుంచి విడుదల కానున్నారు. ఈ నిర్ణయం కేసులో కీలక మలుపుగా భావిస్తున్నారు. ఇప్పటికే ప్రత్యేక దర్యాప్తు బృందం ఆయనను మూడు రోజుల పాటు కస్టడీలోకి తీసుకుని విచారణ జరిపింది. ఈ సమయంలో పలు కీలక అంశాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. ఆర్థిక లావాదేవీలు, నగదు బదిలీలపై ఆయన నుంచి వివరాలు సేకరించినట్లు అధికారులు తెలిపారు. ఈ విచారణ ఆధారంగా కేసులో మరిన్ని అంశాలు బయటపడే అవకాశముందని భావిస్తున్నారు. ఈ కేసులో అవినాశ్ రెడ్డి ఆర్థిక వ్యవహారాల నిర్వహణలో కీలక పాత్ర పోషించినట్లు ఆరోపణలు ఉన్నాయి. మద్యం విక్రయాల్లో అక్రమాలు, సిండికేట్ల ఏర్పాటు వంటి అంశాల్లో ఆయన ప్రమేయం ఉందని దర్యాప్తు సంస్థలు అనుమానిస్తున్నాయి. ఈ కేసులో రాజ్ కేసిరెడ్డి ప్రధాన నిందితుడిగా గుర్తించబడగా, ఇప్పటికే పలువురు అరెస్టయ్యారు.

సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసినప్పటికీ, విచారణ కొనసాగుతుందని అధికారులు స్పష్టం చేశారు. అవసరమైతే అవినాశ్ రెడ్డి సహకారం తీసుకుంటామని తెలిపారు. కేసులో ఉన్న ఇతర నిందితులపై కూడా దర్యాప్తు కొనసాగుతోంది. మరోవైపు మద్యం కుంభకోణం వెనుక ఉన్న అసలు సూత్రధారులను బయటకు తీసేందుకు సిట్ తన దర్యాప్తును వేగవంతం చేసింది. అక్రమాలు, ఆర్థిక లావాదేవీలపై మరింత లోతుగా విచారణ జరుపుతోంది. ఈ కేసు భవిష్యత్తులో మరిన్ని కీలక పరిణామాలకు దారితీయొచ్చని భావిస్తున్నారు.






# ప్రభుత్వ పాఠశాలలో సేవా కార్యక్రమాలతో కాష్యపి రెడ్డి జన్మదిన వేడుకలు

**ఏ ఎస్ రావు నగర్, మార్చ్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** జై జవాన్ కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో (ఎంపీపీఎస్) విద్యార్థుల మధ్య పజ్జూరి కాష్యపి రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. డివిజన్ మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావని మణిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం సేవా కార్యక్రమాలతో ప్రత్యేకంగా నిలిచింది.ఈ సందర్భంగా పీఎంఆర్ సేవా సంస్థ ఆధ్వర్యంలో వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని పాఠశాల విద్యార్థులందరికీ ఉచితంగా నీటి సీసాలను పంపిణీ చేశారు. పావని మణిపాల్ రెడ్డి తన కుమార్తె కాష్యపి రెడ్డితో కలిసి విద్యార్థులకు సీసాలను అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడిన పావని మణిపాల్ రెడ్డి, తన కుమార్తె పుట్టినరోజును ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల మధ్య జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని, సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి ఉపయోగపడడం తమ లక్ష్యమని తెలిపారు.పీఎంఆర్ ప్రతినిధులు మాట్లాడుతూ, దివంగత నేత కీ.శే. పజ్జూరి మణిపాల్ రెడ్డి పేద విద్యార్థుల అభ్యున్నతి కోసం కృషి చేశారని గుర్తుచేశారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లే క్రమంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు



.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పీఎంఆర్ సభ్యులు, స్థానిక నాయకులు, మహిళలు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థులు కాష్యపి రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.పాఠశాల అభివృద్ధికి పజ్జూరి కుటుంబం అందిస్తున్న సహకారం అభినందనీయమని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.



# వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను నేర్చుకున్న ఎల్కతుర్తి రైతులు

**ఎల్కతుర్తి, మార్చి 20:( తెలంగాణ ముచ్చట్లు)**

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలానికి చెందిన రైతులు వ్యవసాయానికి అనుబంధ పరిశ్రమలపై అవగాహన పెంపొందించుకునేందుకు పర్యటన చేపట్టారు. తిమ్మాపూర్-ఎల్కతుర్తి క్లస్టర్ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మండలంలోని చింతలపల్లి, ఎల్కతుర్తి, దామెర, ఇంద్రనగర్, బావుపేట, తిమ్మాపూర్ గ్రామాలకు చెందిన రైతులు సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మేట గ్రామంలో నూతనంగా నిర్మించిన పామ్ ఆయిల్ పరిశ్రమను సందర్శించారు. ఈ పర్యటనను ఎల్కతుర్తి వ్యవసాయ అధికారి పున్నం చందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈ సందర్భంగా పామ్ ఆయిల్ తయారీ ప్రక్రియ, యంత్రాల వినియోగం, ఉత్పత్తి విధానం వంటి అంశాలతో పాటు ఆధునిక సాంకేతిక పద్ధతులపై రైతులకు వివరాలు తెలియజేశారు. పరిశ్రమలో అమలు చేస్తున్న విధానాలను పరిశీలించిన రైతులు తమ వ్యవసాయంలో కూడా ఈ పద్ధతులను అనుసరించాలనే ఆసక్తి వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో ఎల్కతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సుకినే సంతాజీతో పాటు రైతులు దూకిరే బిక్షపతి, సుకినే గోపాలరావు, బూసారి వినయ్, కుడుతాడి రమేష్, హింగే శ్రీకాంత్, అంబీర్ చందర్ రావు, మదే రాములు, క్రాంతి కుమార్, మైస ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# అకస్మిక తనిఖీతో వెలుగులోకి లోపాలు.. చర్యలకు డీఎంహెచ్ఓ ఆదేశం



**జమ్మికుంట టౌన్ మార్చ్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** రానున్న బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఇల్లందకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ముందస్తు సమాచారం లేకుండా చేసిన ఈ సడన్ విజిట్ లో ఆసుపత్రిలోని పలు లోపాలు వెలుగులోకి వచ్చాయి.

వ్యాక్సిన్ రూమ్ నుంచి ల్యాబ్ వరకు ప్రతి విభాగాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన, మందుల నిల్వలు మరియు రోగులకు అందుతున్న సేవలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఫార్మసీలో అవసరమైన మందులు సమృద్ధిగా అందుబాటులో ఉండాలని, రోగి చేతిలో ప్రిస్క్రిప్షన్ మాత్రమే కాకుండా మందు కూడా ఉండేలా చూడాలని స్పష్టం చేశారు.

లేబర్ రూమ్ పరిశీలనలో పరిశుభ్రత లోపాలపై అసంతృప్తి వ్యక్తం చేసిన డీఎంహెచ్ఓ, ఆసుపత్రి పరిసరాలు ఎల్లప్పుడూ శుభ్రంగా ఉండేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోగుల చికిత్సలో నిర్లక్ష్యం అసలు సహించబోమని హెచ్చరించారు.

బ్రహ్మోత్సవాల సమయంలో భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉన్నందున అత్యవసర వైద్య సదుపాయాలు, అంబులెన్స్ సేవలు, అవసరమైన మందుల నిల్వలు పూర్తిగా సిద్ధంగా ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈ అకస్మిక తనిఖీతో ఆసుపత్రి సిబ్బంది అప్రమత్తమవగా, లోపాలను సరిదిద్దే చర్యలు వేగవంతం అవుతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# వనపర్తి జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీగా ఐ. సత్య రెడ్డి నియామకం

**వనపర్తి,మార్చి20(తెలంగాణ ముచ్చట్లు):**

తెలుగు సంవత్సర శ్రీ పరాభవ నామ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ కమిటీని టీపీసీసీ ఉపాధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఉత్తర్వుల ద్వారా ప్రకటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఐ. సత్య రెడ్డిని వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీగా నియమించారు.ఈ నియామకంపై జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. పార్టీ బలోపేతానికి ఐ. సత్య రెడ్డి నాయకత్వం ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఐ. సత్య రెడ్డి మాట్లాడుతూ, పార్టీ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి కార్యకర్తకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ, కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని అన్నారు.తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించినందుకు టీపీసీసీ ఉపాధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌కు, వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొత్త కాపు శివసేనారెడ్డికి, వనపర్తి నియోజకవర్గ శాసనసభ్యులు తూడి మెగా రెడ్డికి ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



# పరాభవ నామ సంవత్సరంలో ప్రజలకు సుఖసంతోషాలు కలగాలి

- మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి

**వనపర్తి,మార్చి20(తెలంగాణ ముచ్చట్లు):**



పరాభవ నామ సంవత్సరంలో ప్రజలందరికీ సుఖసంతోషాలు కలగాలని మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి ఆకాంక్షించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని వనపర్తిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం అనావాయితీగా ప్రముఖ పండితులు, పంచాంగ సిద్ధాంతకర్త మనోహర్ శర్మ మరియు వారి కుమారులు నాగరాజు శర్మలను వారి స్వగృహంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రావుల చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. మన సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుతూ ప్రజల జీవన విధానానికి మార్గదర్శకంగా నిలిచే పంచాంగాన్ని రచించడం అత్యంత అభినందనీయమని కొనియాడారు. పంచాంగం ద్వారా సమాజానికి శుభాశుభాలను తెలియజేయడం గొప్ప సేవ అని పేర్కొన్నారు. పరాభవ నామ సంవత్సరంలో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, పలుస శంకర్ గౌడ్, ప్రేమ్ నాథ్ రెడ్డి, ఎం.డి. గౌస్, నందిమల్ల రమేష్, కిషోర్ కుమార్ రెడ్డి, పార్థ సారథి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# హెచ్ఎంటి నగర్ చెరువు అభివృద్ధి పనులకు శ్రీకారం..

- ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం

**నాచారం, మార్చి 20 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ నియోజకవర్గం నాచారం సర్కిల్ హెచ్ఎంటి నగర్ పెద్ద చెరువు అభివృద్ధి పనులు ప్రారంభమైన నేపథ్యంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చిత్రపటానికి స్థానిక నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. నాచారం డివిజన్ మాజీ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ ఆధ్వర్యంలో చెరువు కట్టపై జరిగిన ఈ కార్యక్రమంలో బారాసా నాయకులు పాల్గొని హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఇచ్చిన హామీ ప్రకారం చెరువు పనులు ప్రారంభించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఉప్పల్ నల్ల చెరువు వద్ద రిటైనింగ్ వాల్ నిర్మాణం కొనసాగుతున్నందున ప్రస్తుతం నీటిని పూర్తిగా విడుదల చేయలేకపోతున్నామని, పనులు పూర్తయిన వెంటనే గేట్లు తెరిచి పెద్ద మొత్తంలో నీటిని ఖాళీ చేసేలా చర్యలు తీసుకుంటామని అధికారులు వివరించినట్లు తెలిపారు.అలాగే త్వరలోనే పటేల్ కుంట చెరువు సుందరీకరణ పనులు కూడా చేపడతామని, అప్పటివరకు చెరువులోని ముర్రుగు, చెత్త తొలగింపు పనులను తక్షణమే ప్రారంభిస్తామని మాజీ కార్పొరేటర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సాయిజెన్ శేఖర్, మేడల మల్లికార్జున గౌడ్, విట్టల్ యాదవ్, కట్ట బుచ్చన్న గౌడ్, మారయ్య, మక్తల శేఖర్ గౌడ్, యాదగిరి, చంద్రశేఖర్, సుగుణాకర్ రావు, జయరాజ్, వాసు, ఈశ్వర్, నరసింహ, రాజేష్ గౌడ్, వెంకటరెడ్డి, వీరాంజనేయులు, రోహిత్, జహీర్, కిరణ్, స్వామి, ఫారూఖ్, ముదసిర్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యదర్శిగా శీలం బ్రహ్మారెడ్డి

- పార్టీ అగ్రనాయకత్వానికి కృతజ్ఞతలు
- పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని హామీ

**కల్లూరు, మార్చి 20 (తెలంగాణ ముచ్చట్లు):**

ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా శీలం బ్రహ్మారెడ్డి నియమితులయ్యారు. కల్లూరు మండలంలోని బత్తులపల్లి గ్రామానికి చెందిన ఆయన, దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ అగ్రనాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, నాయకుల మార్గదర్శకత్వంలో కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావడానికి తన సాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు.





# కాంగ్రెస్ పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శిగా దామా స్వరూప నియామకం

**ఖమ్మం బ్యూరో, మార్చి 20(తెలంగాణ ముచ్చట్లు):** ఖమ్మం నగరంలోని 13వ డివిజన్‌కు చెందిన సామాజిక కార్యకర్త,కాంగ్రెస్ పార్టీ నాయకురాలు దామా స్వరూప ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా నియమితులయ్యారు. పార్టీ కారక్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడంతో పాటు క్రమశిక్షణతో,నిబద్ధతో పని చేస్తూ,పార్టీ బలోపేతానికి, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆమె చేస్తున్న కృషిని,ఆమెలోని నాయకత్వ లక్షణాలను గుర్తించి,జిల్లా నాయకత్వం సిఫార్సుల మేరకు అధిష్టానం దామా స్వరూపను కార్యదర్శిగా నియమించింది.తన నియామకానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకత్వానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.పార్టీ ఆదేశాలు,సూచనల మేరకు పార్టీ అప్పగించిన ప్రతి బాధ్యతను శక్తివంచన లేకుండా నిర్వహిస్తానని, కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ,ప్రభుత్వ చేపడుతున్న అభివృద్ధి,సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి, పార్టీని బలోపేతం చేయడానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.ఆమె నియామకం పట్ల కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం నాయకులు,కార్యకర్తలు,పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు.

# ద్విచక్ర వాహనాల చోరీ కేసుల్లో ఏడుగురు నిందితులు అరెస్టు

- 11 లక్షల విలువ చేసే 17 ద్విచక్ర వాహనాలు స్వాధీనం..
- వివరాలు వెల్లడించిన టౌన్ ఏసిపి రమణమూర్తి

**ఖమ్మం బ్యూరో, మార్చి 20(తెలంగాణ ముచ్చట్లు)**




ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడిన నిందుతులను ఖమ్మం త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ మోహన్ బాబు ఆధ్వర్యంలో అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు ఖమ్మం టౌన్ ఏసీపీ రమణ మూర్తి తెలిపారు.

**ఏసీపీ తెలిపిన వివరాల ప్రకారం...**

ఖమ్మం 3 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల జరిగిన మోటార్ సైకిల్ దొంగతనాలపై ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులకు శుక్రవారం వాహన తనిఖీలలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగా, ఖమ్మం ,మహబూబాబాద్, సూర్యాపేట ప్రాంతాలలో గత కొన్ని నెలలుగా మోటార్ సైకిళ్ళ దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించారు. ఈ కేసులో మొత్తం 7 మంది నిందితులను అరెస్ట్ చేయగా, మరో ఇద్దరు పరారీలో ఉన్నారని, నిందుతుల నుండి పలు మోటార్ సైకిళ్ళను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులు దొంగతనం చేసిన మోటార్ సైకిళ్ళను తక్కువ ధరలకు మెకానిక్స్, ఇతర వ్యక్తులకు అమ్ముతూ వచ్చినట్లు దర్యాప్తులో వెల్లడైందని, పోలీసులు నిందితుల నుండి దొంగిలించిన (17) వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కేసులో మరికొందరు రిసీవర్లను గుర్తించి వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకునే చర్యలు కొనసాగుతున్నాయని అన్నారు.

**అరెస్ట్ అయిన నిందితులు:**

1. కొండమీద యోగీశ్వర్ @ యోగి 19 సం, స్టూడెంట్ మామిళ్ళగూడెం, ఖమ్మం
2.మేడ సాయి కుమార్ 27 సంలు, కమాన్ బజార్, ఖమ్మం
3.మరో నలుగురు మైనర్లు.

**రిసీవర్లు:**

1.ముద్దంగుల నరేష్, 28 స, తీగల బంజర, కొనిజెర్ల, ఖమ్మం. (అరెస్ట్)
2.షేక్ హరీఫ్, 28స, తీగల బంజర, కొనిజెర్ల, ఖమ్మం. (పరారీ లో ఉన్నాడు)
3నునావత్ వినోద్, 30స, తీగల బంజర, కొనిజెర్ల, ఖమ్మం. (పరారీ లో ఉన్నాడు)

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన బీ.ఆర్.ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత నామ



**ఖమ్మం బ్యూరో, మార్చి 20(తెలంగాణ ముచ్చట్లు):** బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పవిత్ర రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లిం సోదర సోదరీ మణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ రంజాన్ నెలకు ఉన్న ఆధ్యాత్మిక ప్రాధాన్యతను వివరించారు. రంజాన్ మాసం త్యాగం, నియమం, సేవా భావానికి ప్రతీక అని ఆయన పేర్కొన్నారు. ఉపవాస దీక్షలు పాటిస్తూ ఈ పవిత్ర మాసం మనిషిలో సహనం, కరుణ, పరస్పర గౌరవాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మైనార్టీ సంక్షేమం కోసం ఎన్నో వినూత్న కార్యక్రమాలు చేపట్టి, ముస్లిం సోదరుల అభివృద్ధి కోసం కట్టుబడి పని చేశారని ఈ సందర్భంగా నామ తెలియజేశారు. ముఖ్యంగా ముస్లిం సమాజం ఆర్థికంగా, విద్యా పరంగా వృద్ధి సాధించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు తెలిపారు. షాదీ ముబారక్ పథకం ద్వారా పేద ముస్లిం కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక సహాయం అందించినట్లు, మైనార్టీ గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యను అందించినట్లు వివరించారు. అలాగే మైనార్టీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, విదేశీ విద్యా సహాయం, వృత్తి ఆధారిత శిక్షణ కార్యక్రమాలు అమలు చేసినట్లు తెలిపారు. డ్రైవర్ ఎంపవర్మెంట్ (ఓనర్ కమ్ డ్రైవర్) పథకం కింద సబ్సిడీతో మైనారిటీ కార్పొరేషన్ ద్వారా యువతకు కార్లు ఇవ్వడం జరిగిందని తెలిపారు. అంతే కాకుండా తాను ఎంపీగా గెలిచిన రెండు సార్లు కూడా 15వ, 17వ లోక్ సభల్లో మైనార్టీల సమస్యలు పైన మాట్లాడటం తో ముస్లిం రిజర్వేషన్స్ విషయమై నాటి కేసీఆర్ ప్రభుత్వం అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి పంపిన తీర్మానం ఆమోదించాలని పార్లమెంట్ సాక్షిగా పోరాటం చేసానని నామ గుర్తు చేసారు. నాటి బీఆర్ఎస్ పాలన లో మసీదుల అభివృద్ధి, దర్గాల సంరక్షణ, హజ్ యాత్రికులకు సౌకర్యాలు కల్పించడం వంటి చర్యలు తీసుకున్నారని నామ పేర్కొన్నారు. ముస్లిం సోదర సోదరీమణుల అభ్యున్నతికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని నామ తెల్పడంతో పాటు రంజాన్ పర్వదినం ప్రతి ఇంట ఆనందం, ఆరోగ్యం, శాంతి, సంపద, శుభ ఫలితాలు నింపాలని నామ ఆకాంక్షించారు.



# కటింగ్ షాపులకు ఉచిత విద్యుత్ కొనసాగింపు


- ముప్పు శ్రీనివాస్ రెడ్డి
- నాగారంలో నాయి బ్రాహ్మణ సంఘంతో ఉగాది శుభాకాంక్షలు
- చిన్న వ్యాపారులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని వ్యాఖ్య

**నాగారం, మార్చ్ 20 (తెలంగాణ ముచ్చట్లు):**

మేడ్చల్ జిల్లా నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి ఉగాది పర్వదినం సందర్భంగా స్థానిక నాయి బ్రాహ్మణ సంఘం సభ్యులతో సమావేశమై శుభాకాంక్షలు తెలియజేశారు. నాగారం నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు బాలకిషన్ నాయి ఆధ్వర్యంలో సంఘ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు .ఈ సందర్భంగా ముప్పు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తోందన్నారు. ముఖ్యంగా చిన్న వ్యాపారులను ప్రోత్సహించే దిశగా కటింగ్ షాపులకు ఉచిత విద్యుత్ సరఫరాను కొనసాగించడం గొప్ప నిర్ణయమని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తుకారాం నాయి, ఉపాధ్యక్షులు శ్రీకాంత్ నాయి, ప్రసాద్ నాయి, ఆర్గనైజింగ్ సెక్రటరీ శేఖర్ నాయి, జాయింట్ కార్యదర్శి వెంకటేష్ నాయి, సలహాదారు నరసింహ నాయి తదితరులు పాల్గొన్నారు.

# దోమల నివారణపై డీసీ స్పందన..





- తెలంగాణ ముచ్చట్లు" కథనానికి అధికారుల స్పందన
- వినతిపత్రం ఫలితం
- ఫాగింగ్, యాంటీ లార్వా చర్యలకు శ్రీకారం

**కాప్రా, మార్చి 20 (తెలంగాణ ముచ్చట్లు):**

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాప్రా సర్కిల్ పరిధిలో దోమల సమస్యపై ప్రజల వినతికి డిప్యూటీ కమిషనర్ శ్రీహరి స్పందించడంతో కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు.కుషాయిగూడ, చర్లపల్లి డివిజన్లలో పెరిగిన దోమల బెడదపై ఇటీవల వచ్చిన తెలంగాణ ముచ్చట్లు వార్తలతో పాటు ప్రజల వినతిపత్రానికి స్పందిస్తూ అధికారులు చర్యలు ప్రారంభించారు.సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కాలనీవాసులు డీసీకి వినతిపత్రం సమర్పించి, ఫాగింగ్ కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించకపోవడంతో దోమల సంఖ్య పెరిగిందని వివరించారు. వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.దీనిపై స్పందించిన డీసీ శ్రీహరి, దోమల నివారణకు ఫాగింగ్ కార్యక్రమాలను పునరుద్ధరించడంతో పాటు పారిశుధ్య పనులను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. అవసరమైన సిబ్బంది, పరికరాలు సమకూర్చి ప్రతి ప్రాంతంలో చర్యలు చేపట్టాలని సూచించారు.దోమల కారణంగా చిన్నపిల్లలు, వృద్ధులు జ్వరాలు, వైరల్ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో తీసుకున్న ఈ నిర్ణయాన్ని ప్రజలు స్వాగతించారు. ముఖ్యంగా కుషాయిగూడ డివిజన్‌లో ప్రత్యేక ఫాగింగ్ కార్యక్రమాలు చేపట్టాలని అధికారులు హామీ ఇచ్చారు.అదేవిధంగా కాలువలు, చెత్త నిల్వలు, నిల్వ నీటి ప్రాంతాలను శుభ్రపరిచి దోమల పెరుగుదలను అరికట్టేందుకు మున్సిపల్ సిబ్బందిని రంగంలోకి దింపుతున్నారు.కుషాయిగూడ డివిజన్ పరిధిలో లక్ష్మీ నరసింహ కాలనీ, మీనాక్షి నగర్ కాలనీ, మధురా నగర్ కాలనీ, గాంధీ నగర్ కాలనీలలో యాంటీ లార్వా ఆపరేషన్‌తో పాటు ఫాగింగ్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఈ రవి, కుషాయిగూడ వాడు ఎంటమాలజీ సూపర్వైజర్ నరేందర్ రెడ్డి మరియు సిబ్బంది పాల్గొన్నారు.ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని చేపట్టిన చర్యలపై స్థానికులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

# చిన్నగుంటపల్లెలో జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ముగింపు

**విజేతలకు బహుమతుల ప్రదానం**

**వనపర్తి,మార్చి20(తెలంగాణ ముచ్చట్లు):**







వనపర్తి మండలం చిన్నగుంటపల్లె గ్రామంలో ఉగాది పండుగను పురస్కరించుకుని స్వామి వివేకానంద యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ముగిసింది.టోర్నమెంట్ చివరి రోజు జరిగిన బహుమతుల ప్రదానోత్సవానికి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా టోర్నమెంట్ విజేతగా నిలిచిన మణిగిల్ల జట్టుకు రూ.40,000 నగదు బహుమతి మరియు షీల్డ్‌ను చిన్నారెడ్డి అందజేశారు.రన్నరప్‌గా నిలిచిన చిన్న గుంటపల్లె జట్టుకు రూ.25,000 నగదు బహుమతి మరియు షీల్డ్‌ను ప్రదానం చేశారు.ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ, క్రికెట్‌కు ప్రపంచవ్యాప్తంగా విశేష ఆదరణ ఉందని తెలిపారు.భారత మహిళా, పురుష క్రికెట్ జట్లు ప్రపంచస్థాయిలో విజేతలుగా నిలవడం గర్వకారణమని అన్నారు. ఐపీఎల్ టోర్నమెంట్ ద్వారా గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తున్నదని పేర్కొన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒలింపిక్స్ క్రీడలను రాష్ట్రంలో నిర్వహించాలని ఆకాంక్షిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ నిర్వహిస్తూ ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నదని అన్నారు.క్రీడాకారులు స్నేహభావంతో ఆడుతూ క్రీడాస్ఫూర్తిని చాటాలని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండి పౌష్టికాహారం తీసుకుంటూ ఆరోగ్యంగా ఉండాలని సూచించారు.రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కొత్తకాపు శివసేన రెడ్డి వనపర్తి నియోజకవర్గానికి స్పోర్ట్స్ స్కూల్ తీసుకురావడానికి కృషి చేస్తున్నారని తెలిపారు.వివేకానంద యూత్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను ప్రశంసిస్తూ నిర్వాహకులను అభినందించారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, మాజీ ఎంపీపీ శంకర్ నాయక్, జిల్లా ఏఐపిసి అధ్యక్షుడు నాగార్జున, కిసాన్ సెల్ అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు ఎత్తం చరణ్ రాజ్, వైస్ ఎంపీపీ సురేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.క్రీడా స్ఫూర్తి, గ్రామీణ ప్రతిభను వెలికి తేవడంలో ఇలాంటి టోర్నమెంట్‌లు కీలకమని పలువురు అభిప్రాయపడ్డారు.

# భక్తి భజన సంకీర్తనలే సన్మార్గానికి మార్గం

- మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి

**వనపర్తి,మార్చి20(తెలంగాణ ముచ్చట్లు):**





మనిషిని సన్మార్గంలో నడిపించే ఏకైక సాధనం భక్తి భజన సంకీర్తనలేనని మాజీ రాజ్యసభ సభ్యుడు రావుల చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు.ఉగాది పండుగను పురస్కరించుకుని శుక్రవారం వనపర్తి సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు భక్తి భజన సంకీర్తనాపరులను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, భారతీయ సంప్రదాయంలో భక్తికి ప్రత్యేక స్థానం ఉందని తెలిపారు.అనేక మంది సంకీర్తనాపరులు సమాజాన్ని సన్మార్గంలో నడిపించేందుకు భక్తి మార్గాన్ని చూపారని చెప్పారు. ఆ వారసత్వాన్ని కొనసాగిస్తూ భజన కీర్తనలకు ప్రాణం పోస్తున్న కళాకారులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.పెబ్బేరు, కంచిరావుపల్లి, తాటిపాముల, వెంకటాపూర్, జానంపేట, కంబాలాపురం తదితర గ్రామాలకు చెందిన దాదాపు 50 మంది కళాకారులను శాలువా, జ్ఞాపికలు మరియు కొత్త సంవత్సరం పంచాంగంతో సత్కరించారు .ఈ కార్యక్రమంలో సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్, బైరోజు చంద్రశేఖర్, జిల్లా రంగస్థల కళాకారుల సంఘం అధ్యక్షుడు ఎల్.ఉమామహేశ్వర్, కరేస్వామి, వనం రాములు, నందిమల్ల అశోక్, కరుణశ్రీ, దిలీప్ రెడ్డి, సితార వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ధాన్యం దుర్వినియోగం - రిలిక్ అగ్రో ఇండస్ట్రీస్‌పై రూ.31 కోట్ల బకాయిల కేసు

- రూ.6.06 చరాస్తులు జప్తు

**వనపర్తి,మార్చి20(తెలంగాణ ముచ్చట్లు):**





వనపర్తి జిల్లాలో ప్రభుత్వ ధాన్యం దుర్వినియోగం వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.నాచపల్లి గ్రామానికి చెందిన ఎం/ఎస్ రిలిక్ అగ్రో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రబి 202223 సీజన్‌కు సంబంధించిన ధాన్యం నిల్వలను స్వప్రయోజనాల కోసం వినియోగించినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ప్రభుత్వం కేటాయించిన 15,678.640 మెట్రిక్ టన్నుల ధాన్యానికి గాను మిల్లర్ 10,661.475 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మర ఆడించి ఇవ్వాల్సి ఉండగా, కేవలం 1,089.288 మెట్రిక్ టన్నులనే ప్రభుత్వానికి అందజేశారు.దీంతో మిల్లులో ఉండాల్సిన 14,076.746 మెట్రిక్ టన్నుల ధాన్యానికి బదులుగా కేవలం 3,563.760 మెట్రిక్ టన్నులు మాత్రమే లభించడం గమనార్హం .ఈ డిఫాల్ట్‌పై వనపర్తి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నెంబర్ 163/2024 కింద కేసు నమోదు చేయబడింది.ప్రస్తుతం గౌరవ తెలంగాణ హైకోర్టు ఆదేశాల ప్రకారం 10,310.09 మెట్రిక్ టన్నుల వడ్ల బకాయిలకు సంబంధించిన సుమారు రూ.31 కోట్లను చెల్లించాల్సి ఉన్నప్పటికీ, సంబంధిత మిల్లర్ చెల్లింపులను తప్పించుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ బకాయిలు చెల్లించకపోవడంతో, మిల్లర్ హైకోర్టును ఆశ్రయించారు. అయితే కోర్టు నుండి అనుకూల ఆదేశాలు రాకపోయినా, "కేసు విచారణలో ఉంది" అనే కారణంతో చెల్లింపులను వాయిదా వేస్తున్నారని సమాచారం.రాష్ట్ర స్థాయి సమావేశాల్లో ముఖ్యమంత్రి మరియు పౌర సరఫరాల శాఖ మంత్రి బకాయిలను తక్షణమే వసూలు చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ రికవరీ చట్టాన్ని అమలు చేయడం జరిగింది.

ఈ మేరకు వనపర్తి తహసిల్దార్ సంబంధిత మిల్లును సందర్శించి, ఆయా శాఖల జిల్లా అధికారుల సమక్షంలో పంచనామ నిర్వహించారు. ఇందులో భాగంగా సుమారు ₹6.06 కోట్ల విలువగల చరాస్తులను గుర్తించి జప్తు చేయడం జరిగింది.ఈ చర్యలతో జిల్లాలోని ఇతర బకాయిదారులైన రైస్ మిల్లర్లకు కఠిన హెచ్చరిక జారీ అయినట్లు అధికారులు పేర్కొన్నారు.

# ఎంపీ ఈటల రాజేందర్ జన్మదిన వేడుకలు

- శాలువాతో సత్కారం
- ఉచిత వైద్య శిబిరంలో 300 మందికి సేవలు

**మల్కాజిగిరి, మార్చి 20 (తెలంగాణ ముచ్చట్లు):**






మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్ జన్మదిన వేడుకలు వినాయకనగర్ డివిజన్‌లో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా వినాయకనగర్ మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి డివిజన్ కార్యకర్తలతో కలిసి షమీర్‌పేటలోని ఎంపీ నివాసంలో ఆయనను కలిసి శాలువా, పూలగుచ్ఛంతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈటల రాజేందర్ ఆయురారోగ్యాలతో ఉండి ప్రజా సేవలో మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మంగేష్, ఓం ప్రకాష్, జగదీశ్ చారి, సంతోష్, సాయి సురేష్, సుమలత, మహేష్, ప్రవీణ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు. అదే సందర్భంగా ఎంపీ జన్మదినాన్ని పురస్కరించుకుని వినాయక నగర్ ప్రధాన రహదారిపై ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రధాన మంత్రి జన ఔషధి కేంద్రానికి చెందిన గోపు రమణారెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో సుమారు 300 మంది రోగులకు ఉచిత వైద్య పరీక్షలు, మందులు అందించారు.ఈ సేవా కార్యక్రమాలు స్థానిక ప్రజల్లో ఆనందాన్ని కలిగించాయి.

## మల్లాపూర్, శక్తి సాయి నగర్ డివిజన్లలో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో కేక్ కట్

- కార్యకర్తల ఉత్సాహభరిత

**మల్లాపూర్, మార్చి 20 (తెలంగాణ ముచ్చట్లు):**



మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్ జన్మదినం సందర్భంగా మల్లాపూర్ మరియు శక్తి సాయి నగర్ డివిజన్లలో బీజేపీ నాయకులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమం బీజేపీ మేడ్చల్ జిల్లా డీసీ సభ్యుడు సంగిశెట్టి రవీంద్రసాగర్ ఆధ్వర్యంలో జరిగింది.ఈ సందర్భంగా మహిళా అధ్యక్షురాలు సబిత యాదవ్, డివిజన్ కార్యదర్శి పుణ్యవతి, బూత్ ప్రెసిడెంట్ పి. లింగం గౌడ్, ఆనంద్, ఎం. నరేష్, మధు, అంజి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కేక్ కట్ చేసి ఎంపీకి శుభాకాంక్షలు తెలియజేశారు.నాయకులు మాట్లాడుతూ, ప్రజాసేవలో ఈటెల రాజేందర్ మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది.

# ద్విచక్ర వాహనం దొంగతనం

- మార్కెట్ వద్ద పార్క్ చేసిన యాక్టివా గల్లంతు...
- సీసీ ఫుటేజ్ పరిశీలనలో పోలీసులు

**కుషాయిగూడ, మార్చి 20 (తెలంగాణ ముచ్చట్లు):** కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ద్విచక్ర వాహనం దొంగతనం జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికంగా వ్యాపారం నిర్వహిస్తున్న సింగిరికొండ గురునాథం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ ఘటన నమోదైంది. గురునాథం కుషాయిగూడ మార్కెట్ లోని షాప్ నెం. 23, మొదటి అంతస్తులో "సిరి పూజా స్టోర్" నిర్వహిస్తున్నారు. ఈ నెల 15వ తేదీ ఉదయం సుమారు 10:30 గంటలకు తన టీఎస్08 ఎఫ్ టి 0164 నంబర్ గల హోండా యాక్టివా 4G వాహనంపై దుకాణానికి వచ్చి, మార్కెట్ వద్ద పార్క్ చేశారు.అదే రోజు మధ్యాహ్నం సుమారు 3:30 గంటలకు దుకాణం నుంచి ఇంటికి వెళ్లేందుకు వచ్చినప్పుడు, వాహనం అక్కడ కనిపించలేదు. వెంటనే పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో గుర్తు తెలియని వ్యక్తులు వాహనాన్ని దొంగిలించి ఉంటారని అనుమానించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వ్యక్తిగత కారణాల వల్ల ఫిర్యాదు ఇవ్వడంలో ఆలస్యం జరిగినట్లు బాధితుడు తెలిపాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సంఘటన జరిగిన ప్రాంతంలోని సీసీ కెమెరా దృశ్యాలను పరిశీలిస్తూ నిందితులను గుర్తించేందుకు చర్యలు చేపట్టారు.

# కుషాయిగూడలో వ్యక్తి అదృశ్యం



**కుషాయిగూడ, మార్చి 20 (తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజ్గిరి పోలీస్ కమిషనరేట్ కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో వ్యక్తి అదృశ్యమైన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, సాయినాథ్ పురం ప్రాంతానికి చెందిన బాచేవార్ ప్రశాంతి తన భర్త బాచేవార్ రాము (29) కనిపించడం లేదని ఫిర్యాదు చేసింది.ఈ నెల 18న మధ్యాహ్నం సుమారు 2:30 గంటల సమయంలో ఇంటి నుండి బయటకు వెళ్లిన రాము తిరిగి రాలేదని పేర్కొంది. అతని మొబైల్ ఫోన్‌కు సంప్రదించగా స్విచ్ ఆఫ్‌లో ఉన్నట్లు తెలిసింది. కుటుంబ సభ్యులు, బంధువుల వద్ద ఆరా తీసినా ఎటువంటి సమాచారం లభించలేదు.రాము స్నేహితుడు ప్రవీణ్‌ను సంప్రదించగా, అదే రోజు రాత్రి 10:30 గంటల వరకు సాయి నగర్ వాలీబాల్ గ్రౌండ్ వద్ద తనతో ఉన్నాడని, అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు తెలిపాడు.అదృశ్య వ్యక్తి ఎత్తు సుమారు 5.5 అడుగులు కాగా, తెలుగు, హిందీ, మరాఠీ భాషలు మాట్లాడగలడని పోలీసులు వెల్లడించారు.ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సంబంధిత సమాచారం ఉన్నవారు పోలీసులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

# యువకుడు అదృశ్యం కుటుంబ సభ్యుల్లో ఆందోళన

- ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన భర్త...
- పోలీసులకు ఫిర్యాదు




**కుషాయిగూడ, మార్చి 20 (తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజ్గిరి పోలీస్ కమిషనర్ కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువకుడు అనుమానాస్పదంగా అదృశ్యమవడం స్థానికంగా కలకలం రేపుతోంది. కాప్రా శివసాయి నగర్‌లో నివసిస్తున్న మదరమోని నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.పోలీసుల వివరాల ప్రకారం, మహబూబ్‌నగర్ జిల్లా రామన్నపల్లి గ్రామానికి చెందిన మదరమోని ఆంజనేయులు (25)తో నాగలక్ష్మికి మూడు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. ఉపాధి కోసం దంపతులు ఏడాది క్రితం కుషాయిగూడకు వచ్చి అద్దె ఇంటిలో నివసిస్తున్నారు .ఈ నెల 19వ తేదీ ఉదయం సుమారు 6 గంటల సమయంలో నాగలక్ష్మి నిద్రలో ఉండగా, ఆమె భర్త ఆంజనేయులు ఎవరికి తెలియజేయకుండా ఇంటి నుండి బయటకు వెళ్లిపోయాడు. అనంతరం లేచి చూసిన ఆమెకు అతను ఇంట్లో కనిపించకపోవడంతో ఆందోళనకు గురైంది. అతని మొబైల్‌కు కాల్ చేయగా స్విచ్ ఆఫ్‌గా ఉన్నట్లు తెలిసింది.తక్షణమే బంధువులను సంప్రదించినప్పటికీ ఎలాంటి సమాచారం లభించకపోవడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. గల్లంతైన వ్యక్తి వివరాలు:ఎత్తు సుమారు 5.6 అడుగులు, తెల్లని వర్ణం, తెలుగు, ఇంగ్లీష్ మాట్లాడగలడు. చివరిసారిగా తెలుపు టీషర్ట్, నలుపు ప్యాంట్ ధరించి కనిపించాడు.ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. ఆచూకీ తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు.

# గదిలో మహిళ ఆత్మహత్య

_కుషాయిగూడలో కలకలం

కాప్రా, మార్చి 20 (తెలంగాణ ముచ్చట్లు):



కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గాంధీనగర్ ప్రాంతానికి చెందిన గడ్డం కృష్ణ (37) తన ఇంటి వద్ద ఉన్న సింగిల్ రూమ్‌ను తన్నీరు వరలక్ష్మి (25)కు అద్దెకు ఇచ్చినట్లు తెలిపారు. వరలక్ష్మి గత మూడు సంవత్సరాలుగా తన తల్లి, తమ్ముడితో కలిసి అక్కడ నివసిస్తోంది. ఇటీవల సుజాత (26) అనే మహిళ కూడా అదే గదిలో ఉంటూ, ఇద్దరూ ఏఎస్ రావు నగర్‌లోని మ్యాక్స్ షోరూమ్‌లో కలిసి పనిచేస్తున్నట్లు సమాచారం. ఒక వారం క్రితం వరలక్ష్మి తల్లి, తమ్ముడు స్వగ్రామానికి వెళ్లినట్లు తెలిపారు.ఈ నెల 19న ఉదయం వరలక్ష్మి పనికి వెళ్లగా, సుజాత గదిలో ఒంటరిగా ఉండిపోయింది. మధ్యాహ్నం సమయంలో పలుమార్లు ఫోన్ చేసినప్పటికీ స్పందన లేకపోయింది. రాత్రి సుమారు 10:30 గంటలకు తిరిగి వచ్చిన వరలక్ష్మి తలుపు తట్టినా స్పందన లేకపోవడంతో కిటికీ ద్వారా లోపల చూసి సుజాత ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతూ కనిపించింది.వెంటనే గృహయజమానికి సమాచారం ఇవ్వడంతో పాటు డయల్ 100కు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు తలుపు బలవంతంగా తెరిచి చూడగా సుజాత మృతి చెందినట్లు నిర్ధారించారు. అనంతరం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రి మోర్చ్యూరీకి తరలించారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, ఆత్మహత్యకు గల కారణాలపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# భక్తులకు శుభవార్త – వాడపల్లికి డీలక్స్ బస్సు ప్రారంభం

ఖమ్మం బ్యూరో, మార్చి 20(తెలంగాణ ముచ్చట్లు)






టీజీఎస్ ఆర్టీసీ ఖమ్మం రీజినల్ మేనేజర్ సరి రామ్ ఆదేశాల మేరకు, ఖమ్మం డిపో మేనేజర్ శివప్రసాద్ ఆధ్వర్యంలో భక్తుల కోరిక మేరకు ఖమ్మం నూతన బస్టాండ్ నుండి వాడపల్లి వరకు డీలక్స్ బస్సు సర్వీసును ప్రారంభించారు.

ఈ బస్సు ప్రతి శుక్రవారం రాత్రి 8 గంటలకు ఖమ్మం నుండి బయలుదేరుతుందని అధికారులు తెలిపారు. వాడపల్లి లోని ప్రసిద్ధ దేవస్థానానికి వెళ్లే భక్తులకు ఈ సర్వీస్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు సూచించారు. మరిన్ని వివరాలకు 9136446666 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. అలాగే ఆన్‌లైన్‌లో www. tgsrtcbus.in ద్వారా కూడా టికెట్లు బుక్ చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు.

# ప్రేమ, దయల కలయిక 'ఈదుల్ ఫితర్'

- విశ్వమానవ సౌభ్రాతృత్వానికి ప్రతీక

ఖమ్మం బ్యూరో, మార్చి 20(తెలంగాణ ముచ్చట్లు)




నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు, క్రమశిక్షణతో కూడిన జీవనశైలి అనంతరం ముస్లిం సోదరులు జరుపుకునే అత్యంత పవిత్రమైన పండుగ 'ఈదుల్ ఫితర్'. కేవలం పండుగగానే కాకుండా, ఆకలి విలువను తెలుసుకుంటూ, తోటివారికి సహాయం చేయాలనే ఉన్నత సందేశాన్ని ఈ పండుగ చాటిచెబుతుంది.

**రంజాన్ మాసం**

పవిత్ర ఖురాన్ అవతరించిన ఈ మాసంలో ముస్లింలు తెల్లవారుజామున 'సహర్'తో మొదలుపెట్టి, సాయంత్రం 'ఇఫ్తార్' వరకు నీటి చుక్క కూడా తీసుకోకుండా ఉపవాసం ఉంటారు. ఈ ముప్పై రోజుల సాధన మనిషిలోని చెడు ఆలోచనలను దూరం చేసి, సహనం మరియు భక్తిని పెంపొందిస్తుంది.

**దానగుణమే పండుగ పరమార్థం**

ఈదుల్ ఫితర్ అంటే 'దానధర్మాల పండుగ' అని అర్థం. ఈ రోజున ప్రతి ముస్లిం తమ సంపాదనలో కొంత భాగాన్ని 'జకాత్' మరియు 'ఫిత్రా' రూపంలో పేదలకు అందజేస్తారు. సమాజంలో ఎవరూ ఆకలితో ఉండకూడదనే ఉద్దేశంతో పండుగ నమాజుకు ముందే ఈ దానధర్మాలను పూర్తి చేయడం ఒక ప్రత్యేకమైన సంప్రదాయం.

**సామూహిక ప్రార్థనలు - ఆత్మీయ ఆలింగనాలు**

ఈద్ రోజున తెల్లవారుజామునే కొత్త బట్టలు ధరించి, సుగంధ ద్రవ్యాలు అద్దుకుని 'ఈద్గా' మైదానాలకు చేరుకుంటారు. వేల సంఖ్యలో భక్తులు కలిసి చేసే సామూహిక ప్రార్థనలు ఐక్యతకు నిదర్శనం. ప్రార్థనల అనంతరం ఒకరికొకరు 'ఈద్ ముబారక్' చెప్పుకుంటూ ఆత్మీయంగా ఆలింగనం చేసుకోవడం సోదరభావాన్ని చాటుతుంది.

**నోరూరించే షీర్ ఖుర్మా**

రంజాన్ అనగానే గుర్తుకు వచ్చేది తియ్యని 'షీర్ ఖుర్మా'. సేమ్యా, పాలు, డ్రై ఫ్రూట్స్ కలిపి చేసే ఈ ప్రత్యేక వంటకాన్ని స్నేహితులకు, బంధువులకు వడ్డించి పండుగ ఆనందాన్ని పంచుకుంటారు. కులమతాలకు అతీతంగా నిర్వహించే 'ఇఫ్తార్ విందులు' గంగాజమునా తెహజీబ్‌కు (మత సామరస్యానికి) అద్దం పడతాయి.

మనిషిని దైవచింతన వైపు మళ్లించడమే కాకుండా, పేదరికం లేని సమాజాన్ని నిర్మించాలనే లక్ష్యాన్ని ఈదుల్ ఫితర్ బోధిస్తుంది. ఈ పండుగ తెచ్చే స్ఫూర్తి అందరి జీవితాల్లో సుఖశాంతులను నింపాలని ఆకాంక్షిద్దాం. మీ అందరికీ ఈదుల్ ఫితర్ శుభాకాంక్షలు!



**షేక్ మదర్ సాహెబ్**
ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు
9440449642వ

# నాలుగో స్తంభానికే ద్రోహమా?

- జర్నలిస్టుల ఇళ్ల స్థలాల పోరాటానికి బీజేపీ అండ
- పాలకుల కన్ను.. జర్నలిస్టుల స్థలాలపైనేనా?
- సొంతింటి కోసం కలం యోధుల పోరు..
- కల్లబొల్లి మాటలు కట్టిపెట్టి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని బీజేపీ డిమాండ్
- ఆ హామీలు ఏమయ్యాయి పొంగులేటి? జర్నలిస్టుల దీక్షా శిబిరంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు సూటి ప్రశ్న

ఖమ్మం బ్యూరో, మార్చి 20(తెలంగాణ ముచ్చట్లు)




సమాజంలో ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా ఉంటూ, అహర్నిశలు శ్రమిస్తున్న జర్నలిస్టుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. అర్హులైన జర్నలిస్టులందరికీ తక్షణమే ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఖమ్మంలో విలేకరులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు బీజేపీ పూర్తి మద్దతు ప్రకటించింది. శుక్రవారం ఈ దీక్షా శిబిరాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, పార్టీ రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవరావు సందర్శించి జర్నలిస్టుల పోరాటానికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ మొండి వైఖరిని, స్థానిక మంత్రుల నిర్లక్ష్యాన్ని వారు తీవ్రంగా ఎండగట్టారు. అధికారంలోకి రాకముందు ఎన్నో హామీలు గుప్పించిన కాంగ్రెస్ నాయకులు, గద్దెనెక్కాక ఏ వర్గాన్నీ దగా చేయకుండా వదిలిపెట్టలేదని విమర్శించారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే విలేకరులను మోసం చేయడం పాలకుల పతనానికి నాంది అని వారు హెచ్చరించారు. ముఖ్యంగా రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుల తీరుపై బీజేపీ నేతలు తీవ్ర విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వ హయాంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వకపోతే, తన సొంత డబ్బులతో ఇళ్లు నిర్మించి ఇస్తానని గొప్పలు చెప్పిన మంత్రి పొంగులేటి.. ఇప్పుడు ఆ మాటలను ఎందుకు నిలబెట్టుకోవడం లేదని నిలదీశారు. ఎస్సార్ గార్డెన్స్ (ఫంక్షన్ హాల్) వెనుక జర్నలిస్టుల కోసం గతంలో కేటాయించిన భూమిపై కొందరు పెద్దల కన్ను పడిందని, దాన్ని కబ్జా చేసే ఉద్దేశంతోనే పంపిణీలో ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. మరోవైపు, ఈ న్యాయమైన సమస్యను పరిష్కరించాల్సింది పోయి, ఈ వ్యవహారంలో తనను లాగొద్దంటూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దాటవేత ధోరణి అవలంబించడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు.

అవినీతి, భూకబ్జాలతో వేల కోట్లు వెనకేసుకుంటున్న నాయకులు, సమాజం కోసం పనిచేసే విలేకరుల సొంతింటి కలను నెరవేర్చడంలో ఎందుకు వెనుకడుగు వేస్తున్నారని బీజేపీ నేతలు ప్రశ్నించారు. ప్రభుత్వం కల్లబొల్లి మాటలు కట్టిపెట్టి, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసే ప్రక్రియను తక్షణమే వేగవంతం చేయాలని ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విలేకరుల పక్షాన నిలబడి ఆందోళనలను తీవ్రతరం చేస్తామని, ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మందడపు సుబ్బారావు, రవి రాథోడ్, మంద సరస్వతి, మారుతినేని వీరభద్ర ప్రసాద్, గడిలా నరేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

# ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తనయుడి రిసెప్షన్ వేడుకకు హాజరైన ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి

- వధూవరులను ఆశీర్వదించిన తెలుగు రాష్ట్రాల రాజకీయ ఉద్దండులు, ప్రముఖులు, ఉన్నత అధికారులు

ఖమ్మం బ్యూరో, మార్చి 20(తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తనయుడు సూర్య సాక్షిల రిసెప్షన్ వేడుక హైదరాబాద్ శివారులో శుక్రవారం రాత్రి జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి,హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అదేవిధంగా శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్రెడ్డి, తెలంగాణ రాష్ట్ర మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, వాకిటి శ్రీహరి, తుమ్మల నాగేశ్వరరావు దుదిల్ల శ్రీధర్ బాబు అడ్లూరి లక్ష్మణ్, గడ్డం వివేక్, మాజీ కేంద్రమంత్రి పల్లంరాజు, జెడి శీలం, ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, ఆంధ్రప్రదేశ్ పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల, సిడబ్ల్యుసి సభ్యులు రఘువీరా రెడ్డి, టి సుబ్బిరామిరెడ్డి, గిడుగు రుద్రరాజు, సిపిఐ జాతీయ నేత కే నారాయణ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, ఎంపీలు మల్లు రవి, సీఎం రమేష్, మాజీ ఎంపీలు కెవిపి రామచంద్రారావు, ఉండవల్లి అరుణ్ కుమార్ లగడపాటి రాజగోపాల్ వి హనుమంతరావు విజయ్ సాయి రెడ్డి, కేశినేని నాని, బిజెపి జాతీయ నేత కే లక్ష్మణ్, వైఎస్ఆర్ సీపీ నాయకులు కన్నా లక్ష్మీనారాయణ అంబటి రాంబాబు బి ఆర్ ఎస్ నేత మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఎర్రబెల్లి దయాకర్ రావు, ప్రముఖ సినీ నిర్మాతలు దిల్ రాజు, అల్లు అరవింద్, డిజిపి శివధర్ రెడ్డి ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# అక్రమంగా నిల్వ చేసిన గ్యాస్ సిలిండర్‌లు పట్టివేత

- నిల్వ ఉంచిన వారిపై కేసు నమోదు

**ఖమ్మం బ్యూరో, మార్చి 20(తెలంగాణ ముచ్చట్లు):** జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శుక్రవారం సిబ్బందితో కలిసి అక్రమ గ్యాస్ సిలిండర్ల నిల్వపై మూడు వేర్వేరు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మొత్తం 39 గృహ అవసరాల గ్యాస్ సిలిండర్ల ను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పౌర సరఫరాల అధికారి తెలిపిన వివరాల ప్రకారం రఘునాథపాలెం మండల కేంద్రమైన మీసేవా కేంద్రంలో తనిఖీ నిర్వహించగా అక్రమంగా నిల్వ చేసిన 32 గ్యాస్ సిలిండర్ల ను స్వాధీనం చేసుకున్నారు. మీసేవా ఆపరేటర్ జంగాల దుర్గారావు మీద అవశ్యక వస్తువుల చట్టం క్రింద కేసు నమోదు చేశారు. ఖమ్మం ఎన్టీఆర్ సర్కిల్ నందు భవాని బిర్యాని హోటల్‌లో నిర్వహించిన తనిఖీలో వ్యాపార అవసరాలకు వినియోగిస్తున్న 3 గృహ వినియోగ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. రఘునాథపాలెంలోని సితారా హోటల్‌లో అక్రమంగా నిల్వ చేసిన 4 గ్యాస్ సిలిండర్ల ను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా గ్యాస్ వినియోగదారులకు జిల్లా పౌర సరఫరాల అధికారి, ఒక సూచనను జారీ చేశారు. గృహ అవసరాల కొరకు వినియోగించే సరఫరా అయ్యే గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వాడుకోవడం చట్టవిరుద్ధమని, అలాంటి అక్రమ కార్యకలాపాలను గమనించిన వారు వెంటనే కార్యాలయానికి సమాచారం అందించవలసిందిగా విజ్ఞప్తి చేశారు.



# భట్టి విక్రమార్క చొరవతో సీసీ రోడ్డులుకు నిధులు మంజూరు

**ఖమ్మం బ్యూరో, మార్చి 20(తెలంగాణ ముచ్చట్లు):** చింతకాని మండలం నేరడ గ్రామంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చొరవతో మాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి 11 లక్షలు సిసి రోడ్లు నిధులు మంజూరులో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వరరావు సహకారంతో శుక్రవారం గ్రామ సర్పంచ్ దూసరి నేతాజీ పసుపు కుంకు వేసి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి అర్జున్ గ్రామ ఉప సర్పంచ్ కోట బాలేష్ గ్రామ వార్డు సభ్యులు అన్నపురెడ్డి వెంకటేశ్వర్లు అమడాల వెంకటేష్ గ్రామ కాంగ్రెస్ సిపిఐ పార్టీలు అధ్యక్షులు కార్యదర్శి మంకెన నాగేశ్వరరావు షేక్ దస్తగిరి దూసరి శ్రీరాములు అలిశ్వం గడ్డమీద వెంకయ్య చెవుల తిరపతిరావు వంకాయలపాటి మాధవరావు షేక్ లాలు షేక్ రహిమాన్ పఠాన్ సోందు షేక్ ఉస్సేన్ మియా చిన్నసైదా కనకపూడి రాములు పులిపాటి వెంకన్న భద్రయ్య పగిళ్ళపల్లి నర్సింహరావు అన్నపురెడ్డి పుల్లయ్య లక్ష్మయ్య చిర్రా రాము షేక్ బాబు షేక్ బిక్కుసాహెబ్ షేక్ బాబు మేడా భాస్కర్ జి నవీన్ షేక్ పాషా షేక్ నాగుల్ మీరా తదితరులు పాల్గొన్నారు

# కేటాయింపులు సరే ఖర్చు పైనే సంశయం

- సిపిఐ నేత బాగం



**ఖమ్మం బ్యూరో, మార్చి 20(తెలంగాణ ముచ్చట్లు):** శాసనసభలో ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్లో భారీ గణాంకాలు నమోదయ్యాయి కానీ కేటాయింపుల వారీగా ఖర్చులపైనే సంశయం ఉందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. బడ్జెట్పై ఆయన స్పందిస్తూ అంకెలను ఘనంగా చూపించి ప్రజలను ఏమార్చే ప్రయత్నం ఉందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయని అప్పులతో కుంగిపోతున్న రాష్ట్రంలో ఈ బడ్జెట్లో కేటాయించిన విధంగా అమలు చేస్తారా అని ఆయన ప్రశ్నించారు. రూ.3.24 లక్షల కోట్ల బడ్జెట్లో వ్యవసాయ రంగానికి కేవలం పది శాతం మాత్రమే అంటే రూ.32వేల కోట్లు మాత్రమే కేటాయించారని ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయ రంగానికి తీరని అన్యాయం జరిగిందన్నారు. అధికారంలోకి రాక ముందు చెప్పిన విధంగా బడ్జెట్లో కేటాయింపులు జరగలేదన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన కేటాయింపులు కూడా అరకొరగానే ఉన్నాయన్నారు. పాత బిల్లుల చెల్లింపుకే కేటాయింపులు సరిపోతాయన్నారు. నిరుద్యోగ భృతి, మహిళలకు తులం బంగారం విషయాన్ని పట్టించుకోలేదన్నారు. రుణమాఫీ, రైతు బంధు, సంక్షేమం గురించి గొప్పగా చెప్పినప్పటికీ కేటాయింపు ఆ స్థాయిలో లేదని ఆయన అన్నారు. పింఛన్ పెంపుకు సంబంధించి ఎన్నికలకు ముందు హామీ ఇచ్చినట్లుగా నాలుగు వేలకు పెంచేందుకు ఈ బడ్జెట్లో కేటాయింపులు లేవన్నారు. విద్య, వైద్యానికి కేటాయింపులు సరైన రీతిలో లేవని ఏడాది కాలంగా ప్రభుత్వం ఇచ్చిన ఏ హామీకి సంబంధించి కేటాయింపులు లేవని హేమంతరావు తెలిపారు. బడ్జెట్పై ఎన్నో అంచనాలతో ఉన్న రాష్ట్ర ప్రజలకు భట్టి బడ్జెట్ సంతృప్తిని ఇవ్వలేకపోయిందన్నారు. ప్రధానమైన వ్యవసాయం, విద్య, వైద్యం కేటాయింపులు ఆశించిన స్థాయిలో లేవని సంక్షేమం, అభివృద్ధి కూడా ఈ కేటాయింపుల ప్రకారం ఆశించిన స్థాయిలో జరగదని ఆయన తెలిపారు. మొత్తంగా అంకెలు గనం అమలు శూన్యమన్న రీతిలో బడ్జెట్ ఉందని ఇక అమలుపై అనేక సంశయాలు ఉన్నాయని హేమంతరావు తెలిపారు.

# బీసీ వర్గం.. రిజర్వేషన్లు, రక్షణ చట్టం, మహిళల కోటా..

- తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల సమస్య

**హన్మకొండ,మార్చి20(తెలంగాణ ముచ్చట్లు):**




భారతదేశంలో 140 కోట్ల జనాభాలో సుమారు 80 కోట్లు మంది బీసీ వర్గాలకి చెందినవారు. ఈ విస్తృత జనాభా సమస్యలను పట్టించుకోకుండా, కొంతమంది దీనిని చిన్న సమస్యగా భావించడం చాలా దురదృష్టకరమే.తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల సమయంలో ప్రభుత్వం బీసీలకు 42% రిజర్వేషన్లు చట్టబద్ధంగా కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చింది. అయితే, రెండేళ్ల గడిచినప్పటికీ, ఈ హక్కులను అమలు చేయడానికి ఎటువంటి నిర్ణాయక చర్యలు తీసుకోలేదు. బీసీల ఓట్లు మాత్రమే సేకరించడానికి, కులగణనలో తప్పులు చూపించడం, బీసీల జనాభాను తగ్గించడం, రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చడానికి వాగ్దానం చేసి కేంద్రానికి పంపి తర్వాత చర్య లేకుండా వదిలేయడం జరుగుతోంది.

కేంద్ర ప్రభుత్వం సహకారం అందించనప్పటికీ, స్థానిక అధికారులు సరైన సమన్వయం, అఖిల పక్ష సమావేశాలు, ధర్నాలు నిర్వహించక, బీసీల హక్కులను రక్షించడంలో విఫలమయ్యారు. కొంతమంది 50% సీలింగ్‌ను దాటితే కోర్టులు రద్దు చేస్తాయి అని అంటున్నా, ఇది రాజకీయ వ్యాఖ్య మాత్రమే. వాస్తవానికి, 50% సీలింగ్ EWS రిజర్వేషన్ల సందర్భంలో ఇప్పటికే దాటిపోయింది, చట్టబద్ధంగా 60% రిజర్వేషన్లు అమలు అవుతున్నాయి, 2022లో జనహిత వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీం కోర్టు ఇదే తీర్పు ఇచ్చింది. 50% సీలింగ్ రాజ్యాంగ మూల సూత్రం కాదని, దాటవచ్చు అని స్పష్టం చేశారు. కాబట్టి బీసీలకు 42% సాధ్యం కాదని తర్కం స్థిరంగా నిలవదు.

కొంతమంది 9వ షెడ్యూల్‌లో బీసీ రిజర్వేషన్లు చేర్చడంపై కూడా విమర్శలు చేస్తున్నారు. 9వ షెడ్యూల్‌లో చేర్చినంత మాత్రాన రక్షణ ఉంటుందా అనే సందేహాలు ఉంటాయి. నిజానికి, 2007లో కోహిలి కేసులో జ్యుడిషియల్ రివ్యూ జరిగింది, కానీ తరువాత 9వ షెడ్యూల్‌లో చేర్చితే అది కేంద్ర హక్కులను భంగం చేయదు. ప్రైవేట్ బిల్లులు, జీవోలు ద్వారా బీసీల హక్కులను మళ్లీ మభ్యపెట్టడం, మోసపుచడం అనవసరం. కొంతమంది కోర్టులు కొట్టేస్తాయి అని చెబుతున్నారు, కానీ ప్రభుత్వ జీవోలను స్టే చేయించడం ద్వారా మోసాలు జరగకుండా చర్యలు తీసుకోవచ్చు.

తెలంగాణలో బీసీల సమస్యలను పట్టించుకుని, తక్షణమే చట్టపరమైన, సమగ్ర మరియు సంక్షిప్త రక్షణ చర్యలు చేపట్టడం సమాజానికి, రాష్ట్రానికి అవసరం.

**బీసీలు చట్టబద్ధ రక్షణ అవసరం :**

తెలంగాణ రాష్ట్రంలో బీసీలు అత్యధిక సంఖ్యలో ఉన్న వర్గం. 2014 సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం బీసీలు రాష్ట్ర జనాభాలో 61%, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేసిన సర్వే ప్రకారం 56.33% ఉంటాయి. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే, తెలంగాణలో బీసీ జనాభా అత్యధికంగా ఉంది.

అయితే, ఇంత పెద్ద జనాభా ఉన్నప్పటికీ, బీసీలు రాజకీయ, ఆర్థిక, సామాజిక, విద్యా, ఉద్యోగ రంగాలలో సరైన ప్రాతినిధ్యం పొందలేదు. హాస్పిటల్‌లు, కాలేజీలు, వ్యాపారం, రాజకీయాలు, సినిమా పరిశ్రమలో కొన్ని ఆధిపత్య కులాలు మాత్రమే ప్రధాన పాత్రలు పోషిస్తూ, బీసీ వర్గాన్ని అణిచివేస్తున్నాయి. ప్రస్తుతానికి బీసీ రిజర్వేషన్లు, విద్యా, ఉద్యోగ అవకాశాల్లో చట్టబద్ధ రక్షణ లేకపోవడం గమనించదగిన విషయం. బీసీ వర్గంపై వివక్ష, మోసాలు, ప్రాధాన్యం లేకపోవడం కొనసాగుతోంది.

భారత రాజ్యాంగం 15వ, 16వ, 46వ అభివరణల ద్వారా వివిధ కుల వర్గాలకు SC, ST, OBC వారిని సమాన అవకాశాలతో ముందుకు తీసుకువచ్చే విధంగా రిజర్వేషన్లు కల్పిస్తుంది. బీసీ వర్గానికి (Backward Classes OBC) రాష్ట్రస్థాయిలో రిజర్వేషన్లు ఉన్నప్పటికీ, వీటి అమలు మరియు రక్షణకు ప్రత్యేకంగా "బీసీ రక్షణ చట్టం" లేదు. SC/ST వర్గాలకు "Scheduled Castes and Scheduled Tribes (Prevention of Atrocities) Act, 1989 వంటిది ఉన్నప్పటికీ, బీసీ వర్గం కోసం అలాంటి చట్టం లేవు. దాంతో ఏవైనా వివక్ష, హింస, అసమానత ఘటనలపై సాధారణ IPC మరియు రిజర్వేషన్ల అమలు మాత్రమే మార్గం అవుతుంది.

తెలంగాణలో బీసీ జనాభా ఎక్కువగా ఉన్నప్పటికీ, వారు రాజకీయ, సామాజిక, విద్యా మరియు ఉద్యోగ రంగాలలో తగిన ప్రాతినిధ్యం పొందలేకపోతున్నారు. వారి హక్కులను, ప్రతినిధిత్వాన్ని భద్రపరచడానికి ప్రత్యేక చట్టం లేకపోవడం పెద్ద సమస్యగా ఉంది. అందుకే బీసీ సమాజం తరఫున, SC/ST రక్షణ చట్టం వంటిది బీసీ వర్గానికి కూడా రూపొందించాలని డిమాండ్ ఎక్కువగా ఉంది.

తెలంగాణలో బీసీ వర్గాల సమస్యలను, వివక్షను అడ్డుకోవడానికి, వారి రిజర్వేషన్లు, ఉద్యోగాలు, విద్యా అవకాశాలను కాపాడడానికి బీసీ రక్షణ చట్టం రూపొందించడం అత్యవసరం. ఇది బీసీల హక్కులను భద్రపరిచి, వివక్ష చూపుతున్న వారిపై తక్షణమే చర్యలు తీసుకునే విధంగా ఉండాలి.

**తెలంగాణలో బీసీ మహిళల కోసం సబ్-కోటా అవసరం:**

తెలంగాణలో బీసీ మహిళలు రాజకీయ ప్రాతినిధ్యం, రిజర్వేషన్ల పరంగా తరచుగా మోసపోతున్నారనేది నిజం. మహిళా కోటా నిబంధనలు సాధారణంగా అన్ని వర్గాల మహిళలపై వర్తిస్తాయి. కానీ బీసీ మహిళలు, జనాభాలో పెద్ద వర్గం అయినప్పటికీ, సామాన్యంగా కోటా అవకాశాల్లో తక్కువ ప్రాతినిధ్యం పొందుతున్నారు. ఈ పరిస్థితి కేవలం శక్తివంతమైన వర్గాలే ఈ కోటాను ఆక్రమించడం వల్ల ఏర్పడుతుంది.

ప్రస్తుతానికి బీసీ మహిళలకు ప్రత్యేక సబ్ కోటా లేదు. అందువల్ల, స్థానిక పాలన, మునిసిపల్, గ్రామ స్థాయిలలో బీసీ మహిళల హక్కులు పరిమితమవుతున్నాయి. బీసీ మహిళల రాజకీయ శక్తి తగ్గిపోవడం, ప్రాతినిధ్యం లేకపోవడం అనేది వారి సమాజంలో వర్గీయ అసమానతలను మరింత పెంచుతోంది.

ప్రస్తుతం మహిళా కోటా (33%) అన్ని వర్గాల మహిళలకు వర్తిస్తుండగా, బీసీ మహిళలు సాధారణంగా ప్రముఖ వర్గాల ఆక్రమణ కారణంగా కోటా అవకాశాల్లో మోసపోతున్నారు. ఇది రాజకీయ, సామాజిక మరియు ఆర్థిక శక్తి సమతుల్యాన్ని బద్ధకం చేస్తోంది. అందువల్ల మహిళా బిల్లులో బీసీ సబ్‌కోటా అమలు చేయడం అత్యవసరం. ఇది బీసీ మహిళలకు నిర్బంధమైన రిజర్వేషన్ల హక్కు కల్పిస్తుంది. స్థానిక మరియు రాష్ట్ర పాలనలో సమగ్ర ప్రాతినిధ్యం పెంచుతుంది. సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో బీసీ మహిళల శక్తి సమానంగా ఉపయోగపడుతుంది.

తెలంగాణలో బీసీ మహిళలు ఇంకా రాజకీయంగా, రిజర్వేషన్ల పరంగా మోసపోతోన్న ఈ పరిస్థితిని అర్థం చేసుకుని, మహిళా బిల్లులో బీసీ సబ్‌కోటా అమలు చేయడం సమాజంలో సమానత్వానికి, సామాజిక న్యాయానికి, బీసీ వర్గాల శక్తివృద్ధికి కీలకం.



బసడ సంపత్ యాదవ్
7032132593

# ఈ బడ్జెట్ సామాన్య ప్రజల ఆశలను తుంచేసింది

- ఏనుగుల రాకేష్ రెడ్డి
- బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు

**హన్మకొండ,మార్చి20(తెలంగాణ ముచ్చట్లు):**




హనుమకొండలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, ఆర్థిక వేత్త ఏనుగుల రాకేష్ రెడ్డి తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఎన్జీవోస్ కాలనీలోని తన కార్యాలయం నుండి స్పందించిన ఆయన, ఈ బడ్జెట్‌ను పూర్తిగా దిశాహీనంగా, అసంపూర్ణంగా అభివర్ణించారు. బడ్జెట్‌లో విజన్, స్పష్టత, నిబద్ధత లేవని పేర్కొంటూ ఇది వట్టి మాటలతో నిండిన బడ్జెట్‌గా విమర్శించారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా ఏ అంశమూ లేదని, పెట్టుబడిదారులకు గానీ, మార్కెట్‌కు గానీ నమ్మకం కలిగించేలా లేదని అభిప్రాయపడ్డారు. ఈ బడ్జెట్ సామాన్య ప్రజల ఆశలను తుంచేసిందని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం విస్మరించిందని, ఆరు హామీల అమలు విషయంలో వెనుకడుగు వేసిందని ఆరోపించారు. యువతకు ఉపాధి అవకాశాలపై ఎలాంటి ప్రణాళిక లేకపోవడం వల్ల వారి భవిష్యత్తు సంక్షోభంలో పడిందని వ్యాఖ్యానించారు. పాత పథకాలకు పేర్లు మార్చి కొత్తగా ప్రవేశపెట్టినట్లు చెప్పడం తప్ప, వాస్తవానికి కొత్తదనం ఏమీ లేదని విమర్శించారు. రాష్ట్ర పరిపాలనలో తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలు భవిష్యత్తులో సమస్యలకు దారితీసే అవకాశం ఉందని తెలిపారు.

ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని, దీనిపై ప్రజలే ముందుకు వచ్చి ప్రశ్నించాల్సిన అవసరం ఉందని రాకేష్ రెడ్డి సూచించారు.

# తల్లి పేరనున్న భూమిని సమానంగా పంచాలి

- అన్నదమ్ముల సమస్యలోకి పొంగులేటిని, దయాకర్‌రెడ్డిని లాగొద్దు
- తండ్రి పేరునున్న భూమిని కాజేసేందుకు యత్నం
- మీడియా సమావేశంలో కొప్పుల రమేష్ అన్నదమ్ములు

**ఖమ్మం బ్యూరో, మార్చి 20(తెలంగాణ ముచ్చట్లు)**





తల్లి పేరనున్న భూమిని ఆమె ఐదుగురు కొడుకులకు సమానంగా పంచాలని వారసులు కోరారు. ఖమ్మంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో కొప్పుల రమేష్, కొప్పుల నాగేశ్వరరావు, కొప్పుల జనార్ధన్, కొప్పుల జైపాల్, కొప్పుల నాగేశ్వరరావు తండ్రి జైపాల్ కోరారు. ఖమ్మం రూరల్ మండలం మంగళగూడెంకు చెందిన వారు మీడియాతో మాట్లాడుతూ తీర్థాల రెవెన్యూలోని 760 సర్వే నెంబర్‌లో కొప్పుల పేరమ్మ పేరు మీద ఉన్న 4.13 కుంటలు మెట్ట భూమిని కొప్పుల రామారావు తన భార్య సుధారాణి పేరు మీద, ఎకరం ఒక కుంట మాగాణిని అతని కొడుకు ప్రపుల్లకుమార్ పేరు మీద దొంగతనంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని తెలిపారు. ఇది తెలుసుకున్న రామారావు తల్లి వీరమ్మ దానిని రద్దు చేయించి, తన ఐదుగురు కొడుకులకు సమానంగా పంచాలని వీలునామా రాసిందని, అఫిడవిట్‌లో పేర్కొందని తెలిపారు. కొప్పుల పుల్లయ్య పేరు మీద ఉన్న 5 ఎకరాల 32 కుంటల భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు రామారావు యత్నిస్తున్నాడని ఆరోపించారు. ఇది అన్నదమ్ముల, పాలెభాగాల సమస్య అని అన్నారు. ఇందులోకి అనవసరంగా మంత్రి పొంగులేటిని, ఆయన క్యాంప్ ఆఫీస్ ఇన్‌ఛార్జి దయాకర్‌రెడ్డిని లాగుతున్నారని, ఇది సరి కాదని పేర్కొన్నారు. తమ సమస్యకు, పొంగులేటికి, దయాకర్‌రెడ్డికి సంబంధం లేదని స్పష్టం చేశారు. మంత్రి అంటే గిట్టని వారు కొప్పుల రామారావు, జగదీష్‌తోటి రాజకీయంగా పూయాలని చూస్తున్నారని పేర్కొన్నారు. తమ సమస్యను తామే పరిష్కరించుకుంటామన్నారు. దీనికి రాజకీయం పూయవద్దని సూచించారు.

# పీసీపీఎన్డీటీ చట్టం అమలులో కఠిన చర్యలు డిఎల్ఏసి సమావేశం

- కొత్త కేంద్రాలకు ఆమోదం...
- అక్రమ లింగ నిర్ధారణపై హెచ్చరికలు

**మేడ్చల్-మల్కాజిగిరి, మార్చి 20 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా వైద్య & ఆరోగ్యశాఖ అధికారి డా. సి. ఉమగౌరి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సలహా కమిటీ (డిఎల్ఏసి) సమావేశం జరిగింది. గర్భధారణ పూర్వ మరియు గర్భస్త శిశు లింగ నిర్ధారణ నిషేధ చట్టం-1994 మరియు రూల్స్-1996 అమలుపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా అల్ట్రాసౌండ్ సోనోగ్రఫీ కేంద్రాలు, జన్యు సలహా కేంద్రాలు, జన్యు ప్రయోగశాలలు, ఇమేజింగ్ కేంద్రాల స్థాపనకు వచ్చిన కొత్త దరఖాస్తులను కమిటీ పరిశీలించి ఆమోదం తెలిపింది. అలాగే ఇప్పటికే ఉన్న కేంద్రాల పునరుద్ధరణలపై కూడా సమీక్ష చేపట్టింది.చట్టం కచ్చితంగా అమలుకై కార్యాచరణ ప్రణాళిక రూపొందించిన కమిటీ సభ్యులు, అక్రమ లింగ నిర్ధారణను పూర్తిగా అరికట్టాలని సూచించారు. ప్రైవేట్ హెల్త్ ఫెసిలిటీలలో నమోదు కాని సౌకర్యాల్లో లింగ నిర్ధారణ చేయడం లేదా సహకరించడం చట్ట రీత్యా నేరమని డా. ఉమగౌరి స్పష్టం చేశారు. అబ్బాయి లేదా అమ్మాయి లింగ ఎంపిక పూర్తిగా నిషేధించబడిందని, ఈ నేరానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చట్టంలో పేర్కొన్న అవసరాలకే డయాగ్నస్టిక్ టెక్నిక్‌లను వినియోగించాలన్నారు .ఈ సమావేశంలో డా. గురు భార్గవ్ (శిశువైద్యుడు), డా. స్వర్ణలత (గైనకాలజిస్ట్), డా. డి. స్వర్ణలత (జన్యు శాస్త్రవేత్త), శ్రీ కుమార కృప (ఎన్జీఓ), హైమవతి (ఎన్జీఓ) పాల్గొన్నారు.



# తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించిన మహానుభావుడు

**హన్మకొండ,మార్చి20(తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండలో సేవాలాల్ సేన, సేవాలాల్ విద్యార్థి సేన ఆధ్వర్యంలో కామ్రేడ్ జాటోత్ ఠాను నాయక్ 76వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కాకతీయ విశ్వవిద్యాలయం మొదటి గేటు ఎదుట జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు, విద్యార్థి సంఘ ప్రతినిధులు పాల్గొని నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా సేవాలాల్ విద్యార్థి సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాంకుడోత్ అశోక్ నాయక్ మాట్లాడుతూ, జాటోత్ ఠాను నాయక్ తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించిన మహానుభావుడని పేర్కొన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, వ్యక్తి చాకిరీ విముక్తి కోసం నిరంతరం పోరాడిన ఆయన, పేద ప్రజల హక్కుల సాధనలో అపారమైన కృషి చేశారని తెలిపారు. ఆయన పోరాట ఫలితంగా అనేక ప్రాంతాల్లో పేదలకు భూములు లభించడంతో పాటు అగ్రవర్ణాల ఆధిపత్యం నుండి విముక్తి కలిగిందని వివరించారు.ఈ కార్యక్రమంలో ఠాను నాయక్ చిత్రపటానికి వాంకుడోత్ అశోక్ నాయక్, కునుసోతు మురళి నాయక్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన త్యాగాలను స్మరించుకున్నారు.



ఈ కార్యక్రమంలో సేవాలాల్ విద్యార్థి సేన వరంగల్ జిల్లా కన్వీనర్ బానోతు సుమన్ నాయక్, విశ్వవిద్యాలయ అధ్యక్షుడు ఇస్లావత్ వీరన్న నాయక్, ఆలోజి నాయక్, మహిళా విభాగం సభ్యురాలు శివాని తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా లోహిత గ్రామంలో పోచమ్మ అమ్మవారి బోనాల జాతర

**వరంగల్,మార్చి20(తెలంగాణ ముచ్చట్లు):**

వరంగల్ జిల్లాలో సంగెం మండలం లోని లోహిత గ్రామంలో పోచమ్మ అమ్మవారి బోనాల జాతర భక్తిశ్రద్ధల మధ్య కనులపండుగగా నిర్వహించారు. ఉగాది పండుగను పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, పెద్ద తండ గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ దంపతులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా డీసీసీ ఎస్టీ సెల్ చైర్మన్ గుగులోత్ వినోద్ రవీందర్ నాయక్ ఆలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని, తమపై కూడా అమ్మవారి కటాక్షం ఉండాలని ప్రార్థనలు చేశారు.
జాతర సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆలయం చుట్టూ ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లు, ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలతో ప్రదక్షిణలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూలతో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.లోహిత, పెద్ద తండ గ్రామ ప్రజలందరిపై పోచమ్మ అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని సర్పంచ్ దంపతులు ఆకాంక్షిస్తూ, ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.




# బండి మోహన్ జన్మదిన వేడుకలు



**–శుభాకాంక్షలు తెలిపిన బిఆర్ఎస్ నాయకులు**
**– కార్యకర్తల సందడి**

**కాప్రా, మార్చి 20 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్‌లో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు బండి మోహన్ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయనను కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.
బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కరిపే ప్రవీణ్ వంజరి, పెద్దపురం కుమారస్వామి బండి మోహన్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ అభివృద్ధి, బలోపేతానికి ఆయన చేస్తున్న సేవలను వారు ప్రశంసించారు.ఈ సందర్భంగా బండి మోహన్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను ఉత్సాహంగా జరిపారు.

# లాభాల్లో భారత స్టాక్ మార్కెట్లు..

**ముంబై, మార్చి 20 (తెలంగాణ ముచ్చట్లు):**

భారతీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం లాభాలతో ముగిశాయి. గురువారం భారీ నష్టాల తర్వాత ఈరోజు మార్కెట్ కోలుకుని పెట్టుబడిదారులకు కొంత ఊరట కలిగించింది.
ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 325.72 పాయింట్లు పెరిగి 74,532.96 వద్ద ముగిసింది. అలాగే నిఫ్టీ 50 కూడా 112.35 పాయింట్లు లాభపడి 23,114.50 వద్ద స్థిరపడింది.
ఉదయం మార్కెట్ మంచి ఉత్సాహంతో ప్రారంభమైంది. సెన్సెక్స్ 74,800 పాయింట్ల వద్ద ప్రారంభమై, ఒక దశలో 600 పాయింట్ల వరకు లాభపడింది. అదే విధంగా నిఫ్టీ కూడా 23,200 పాయింట్ల వద్ద ప్రారంభమై 200 పాయింట్ల వరకు ఎగబాకింది. అయితే మధ్యాహ్నం తర్వాత అమ్మకాల ఒత్తిడి పెరగడంతో చివరికి లాభాలు కొంత తగ్గిపోయాయి.



ఈరోజు ట్రేడింగ్‌లో ఐటీ, మెటల్ రంగాలకు చెందిన షేర్లు బలంగా రాణించాయి. టెక్ మహీంద్రా 3.01 శాతం, ఇన్ఫోసిస్ 2.90 శాతం, టాటా స్టీల్ 2.81 శాతం, ట్రెంట్ 2.60 శాతం, టైటాన్ కంపెనీ 1.93 శాతం లాభాలు నమోదు చేశాయి.
ఇక నష్టాల్లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 2.29 శాతం పడిపోయింది. అలాగే భారత్ ఎలక్ట్రానిక్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఇండిగో, బజాజ్ ఫైనాన్స్ షేర్లు స్వల్ప నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ ప్రభావం కూడా ఈరోజు ట్రేడింగ్‌పై కనిపించింది. ముడి చమురు ధర బ్యారెల్‌కు 110 డాలర్ల వద్ద కొనసాగుతుండగా, బంగారం ఔన్స్ ధర 4665 డాలర్లకు చేరింది. మరోవైపు రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే మరింత బలహీనమైంది. ప్రస్తుతం రూపాయి మారకం విలువ 93.75 వద్ద కొనసాగుతోంది. మొత్తానికి, ఉదయం బలమైన ప్రారంభం ఉన్నప్పటికీ చివర్లో అమ్మకాల ఒత్తిడి కారణంగా మార్కెట్ లాభాలు కొంతమేర తగ్గినా, రోజు మొత్తానికి పాజిటివ్ ట్రెండ్ కొనసాగడం పెట్టుబడిదారులకు విశ్వాసాన్ని కలిగించింది.



# పసిడి ధరల్లో స్వల్ప పెరుగుదల

**హైదరాబాద్, మార్చి 20 (తెలంగాణ ముచ్చట్లు):** మధ్య ప్రాచ్య ప్రాంతంలో కొనసాగుతున్న ఉద్రిక్తతల ప్రభావంతో ఇటీవలి రోజుల్లో మార్పులకు లోనవుతున్న బంగారం ధరలు, నేడు స్వల్పంగా పెరిగాయి. నిన్న భారీగా తగ్గిన ధరలు ఈరోజు కొంతమేర కోలుకోవడంతో కొనుగోలుదారుల్లో మళ్లీ చర్చ మొదలైంది. దేశవ్యాప్తంగా మేలిమి బంగారం ధర సగటున రూ.650 వరకు పెరిగినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. 10 గ్రాముల 22 క్యారెట్ బంగారం ధర కూడా దాదాపు రూ.600 మేర ఎగబాకింది. అయితే వెండి ధర మాత్రం బంగారం ట్రెండ్‌కు విరుద్ధంగా క్షీణత దిశలోనే కొనసాగుతూ మరోసారి తగ్గుదల నమోదు చేసింది. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో ఉదయం 10 గంటల సమయానికి 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.1,50,930కు చేరుకుంది. ఇది నిన్నటి ధరతో పోలిస్తే రూ.650 పెరుగుదలగా నమోదైంది. అదే విధంగా 22 క్యారెట్ బంగారం ధర రూ.1,38,350 వద్ద కొనసాగుతోంది. ఇక వెండి విషయానికి వస్తే, కిలో వెండి ధర ప్రస్తుతం రూ.2,64,900గా నమోదైంది. నిన్నటి స్థాయితో పోలిస్తే పెద్దగా మార్పులు లేకపోయినా, గత కొన్ని రోజులుగా వెండి ధరల్లో ఒడిదుడుకులు కనిపిస్తున్నాయి.
ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి, డాలర్ మార్పిడి విలువలు, అంతర్జాతీయ పరిస్థితులు వంటి అంశాలు బంగారం ధరలపై ప్రభావం చూపుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా మధ్య ప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్తతలు పెట్టుబడిదారులను సురక్షిత పెట్టుబడులవైపు మళ్లిస్తున్నాయి. ముందు రోజులలో కూడా బంగారం, వెండి ధరలు ఇలాగే మార్పులకు లోనయ్యే అవకాశముందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కొనుగోలుదారులు ధరల మార్పులను గమనిస్తూ నిర్ణయాలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

## ఇరాన్ యుద్ధ ప్రభావం.. ప్రీమియం పెట్రోల్ ధర పెంపు

**న్యూఢిల్లీ, మార్చి 20 (తెలంగాణ ముచ్చట్లు):**




మధ్య ప్రాచ్య ప్రాంతంలో కొనసాగుతున్న ఉద్రిక్తతల ప్రభావం భారత్‌పై కూడా మెల్లగా కనిపిస్తోంది. ఇప్పటికే ఎల్పీజీ సరఫరా సమస్యలు, ధరల పెరుగుదలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు ఇప్పుడు పెట్రోల్ ధరల రూపంలో మరో భారంగా మారింది. ముఖ్యంగా ప్రీమియం పెట్రోల్ ధరలను పెంచుతూ ఆయిల్ కంపెనీలు కీలక నిర్ణయం తీసుకున్నాయి.
ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ మరియు హిందుస్తాన్ పెట్రోలియం సంస్థలు ప్రీమియం పెట్రోల్ (పవర్ పెట్రోల్) ధరలను లీటర్‌కు రూ.2 నుంచి రూ.2.35 వరకు పెంచుతున్నట్లు ప్రకటించాయి. ఈ పెంపు శుక్రవారం నుంచే అమల్లోకి రానుంది.
ఇండియన్ ఆయిల్ సంస్థకు చెందిన ఎక్స్‌పీ95 రకం పెట్రోల్, అలాగే హిందుస్తాన్ పెట్రోలియం సంస్థకు చెందిన పవర్ పెట్రోల్ వంటి హై ఆక్టేన్ ఇంధనాలపై ఈ ధరల పెంపు వర్తించనుంది. అయితే, ఈ పెంపు ప్రస్తుతం కొన్ని ఎంపిక చేసిన నగరాల్లో మాత్రమే అమలవుతుందని సమాచారం.
పవర్ పెట్రోల్ సాధారణ పెట్రోల్‌తో పోలిస్తే వాహనాలకు మెరుగైన పనితీరు, ఎక్కువ శక్తిని అందిస్తుంది. కానీ ఇలాంటి ఇంధనం ఉపయోగించే వాహనాలు తక్కువగా ఉండటంతో, ఈ పెంపు ప్రభావం పరిమితంగానే ఉండనుంది.
ఇక సామాన్య ప్రజలకు ఊరటనిచ్చే విషయం ఏమిటంటే, సాధారణ పెట్రోల్, డీజిల్ ధరల్లో ఎలాంటి మార్పులు చేయలేదు. ఇటీవలి కాలంలో ఇవి స్థిరంగానే కొనసాగుతున్నాయి. మార్కెట్ నిపుణుల అభిప్రాయం ప్రకారం, అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు పెరగడం, అలాగే రూపాయి విలువ తగ్గడం వంటి కారణాల వల్ల ఆయిల్ కంపెనీలపై ఆర్థిక ఒత్తిడి పెరిగింది. ప్రస్తుతం క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 110 డాలర్ల వద్ద కొనసాగుతుండటం కూడా ఒక ప్రధాన కారణంగా చెబుతున్నారు.
ఈ పరిస్థితుల్లో అన్ని రకాల ఇంధనాల ధరలు పెంచకుండా, ప్రీమియం పెట్రోల్ ధరలకే పరిమితం చేయడం ద్వారా కంపెనీలు ఒక సమతుల్య నిర్ణయం తీసుకున్నట్లు భావిస్తున్నారు. అయితే భవిష్యత్తులో అంతర్జాతీయ పరిస్థితులు ఇలాగే కొనసాగితే సాధారణ పెట్రోల్, డీజిల్ ధరలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

# మార్చి 27న భారత్‌లోకి 'రెడ్‌మీ 15ఏ 5జీ' ఎంట్రీ




**న్యూఢిల్లీ, మార్చి 20 (తెలంగాణ ముచ్చట్లు):** చైనా టెక్ దిగ్గజం షియోమీ సబ్‌బ్రాండ్ రెడ్‌మీ భారత మార్కెట్లో మరో బడ్జెట్ స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేయడానికి సిద్ధమైంది. 'ఏ' సిరీస్‌లో భాగంగా 'రెడ్‌మీ 15ఏ 5జీ' స్మార్ట్‌ఫోన్‌ను మార్చి 27న అధికారికంగా లాంచ్ చేయనున్నట్లు కంపెనీ ప్రకటించింది. తక్కువ ధరలో అధునాతన ఫీచర్లను కోరుకునే వినియోగదారులను దృష్టిలో పెట్టుకుని ఈ ఫోన్‌ను రూపొందించారు.
ఈ స్మార్ట్‌ఫోన్ ముఖ్యంగా డిస్‌ప్లే, బ్యాటరీ విభాగాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఇందులో 120 హెర్ట్జ్ రిఫ్రెష్ రేట్‌తో కూడిన డిస్‌ప్లేను అందిస్తున్నారు. దీని వల్ల గేమింగ్, వీడియో స్ట్రీమింగ్ సమయంలో స్మూత్ అనుభవం లభిస్తుంది.
బ్యాటరీ పరంగా ఈ ఫోన్ భారీ సామర్థ్యంతో రానుంది. 6300 ఎంఏహెచ్ బ్యాటరీతో ఒకసారి ఛార్జ్ చేస్తే ఎక్కువసేపు ఉపయోగించుకునే వీలుంటుంది. వేగవంతమైన పనితీరు కోసం ఆక్టాకోర్ 5జీ చిప్‌సెట్‌ను అందించనున్నారు. దీంతో మల్టీటాస్కింగ్, ఇంటర్నెట్ స్పీడ్ మెరుగ్గా ఉంటుంది.
ఫోటోగ్రఫీ విషయానికి వస్తే, వెనుక భాగంలో డ్యూయల్ కెమెరా సెటప్ ఉండగా, 32 మెగా పిక్సెల్ ఏఐ ప్రైమరీ కెమెరా ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ఈ ఫీచర్లు బడ్జెట్ సెగ్మెంట్‌లో ఈ ఫోన్‌కు మంచి పోటీని తీసుకురావచ్చని నిపుణులు భావిస్తున్నారు.
గతంలో విడుదలైన 'రెడ్‌మీ 15 5జీ' మోడల్‌తో పోలిస్తే ఈ కొత్త వేరియంట్‌లో కొన్ని కీలక మార్పులు ఉండనున్నాయి. గత మోడల్ సుమారు రూ.14,999 ప్రారంభ ధరలో లభించగా, కొత్త ఫోన్ కూడా అదే శ్రేణిలో ఉండే అవకాశం ఉంది.
మొత్తానికి, తక్కువ ధరలో 5జీ సదుపాయం, భారీ బ్యాటరీ, మంచి డిస్‌ప్లే వంటి ఫీచర్లతో 'రెడ్‌మీ 15ఏ 5జీ' మార్కెట్లో గట్టి పోటీ ఇవ్వనుందని అంచనా. మార్చి 27న లాంచ్ తర్వాత దీని పూర్తి ధర, అందుబాటు వివరాలు అధికారికంగా వెల్లడికానున్నాయి.

# భారీగా తగ్గిన నాట్కో వెయిట్ లాస్ మందుల ధరలు

**హైదరాబాద్, మార్చి 20 (తెలంగాణ ముచ్చట్లు):**




అధిక బరువు సమస్యతో బాధపడుతున్న వారికి ఔషధ రంగంలో ప్రముఖ సంస్థ నాట్కో ఫార్మా భారీ ఊరటనిచ్చింది. అంతర్జాతీయ స్థాయిలో ప్రాచుర్యం పొందిన వెయిట్ లాస్ ఔషధానికి సంబంధించిన పేటెంట్ గడువు ముగియడంతో, అదే ఔషధాన్ని తక్కువ ధరలో భారత మార్కెట్లో అందుబాటులోకి తీసుకువచ్చింది. దీంతో ఇప్పటివరకు ఖరీదైన చికిత్సగా భావించిన బరువు తగ్గించే మందులు ఇప్పుడు సాధారణ ప్రజలకు కూడా అందుబాటులోకి రావడం విశేషంగా మారింది. ఈ కొత్త ఔషధంలో ప్రధానంగా ఉపయోగిస్తున్న 'సెమాగ్లుటైడ్' అనే ఔషధ పదార్థం, శరీరంలోని ఆకలి నియంత్రణను ప్రభావితం చేస్తూ బరువు తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఈ ఔషధం అంతర్జాతీయంగా మంచి ఫలితాలు ఇవ్వడంతో విస్తృతంగా వినియోగంలోకి వచ్చింది. అయితే, ఇప్పటివరకు దీని ధరలు చాలా ఎక్కువగా ఉండటం వల్ల సాధారణ ప్రజలకు అందుబాటులో లేకపోయాయి.
ఈ నేపథ్యంలో నాట్కో ఫార్మా 'సెమనాట్', 'సెమాఫుల్' అనే కొత్త బ్రాండ్లతో ఈ మందులను విడుదల చేసింది. ఒక్క డోస్ ధరను కేవలం రూ.1,290గా నిర్ణయించడం ద్వారా మార్కెట్లో సంచలనానికి తెరలేపింది. ఇది ప్రస్తుత బ్రాండెడ్ మందుల ధరతో పోలిస్తే సుమారు 90 శాతం తక్కువ కావడం గమనార్హం. దీంతో బరువు తగ్గాలనుకునే వారికి ఇది పెద్ద ఉపశమనం కలిగించే అంశంగా మారింది. ప్రస్తుతం ఈ ఔషధాలు వయల్స్ రూపంలో అందుబాటులో ఉండగా, రానున్న ఏప్రిల్ నెల నుంచి పెన్ డివైస్ రూపంలో కూడా విడుదల చేయనున్నట్లు కంపెనీ ప్రకటించింది. దీని ద్వారా వినియోగదారులకు మరింత సౌకర్యవంతమైన విధంగా మందులను ఉపయోగించే అవకాశం లభించనుంది. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఈ తరహా మందులు బరువు తగ్గడంలో సహాయపడినప్పటికీ, వైద్యుల సూచనల మేరకే ఉపయోగించాలి. సరైన ఆహార నియమాలు, వ్యాయామం వంటి జీవనశైలిలో మార్పులు కూడా అనుసరించినప్పుడే దీర్ఘకాలిక ఫలితాలు సాధ్యమవుతాయని వారు సూచిస్తున్నారు. మొత్తానికి, నాట్కో ఫార్మా తీసుకున్న ఈ నిర్ణయం భారత ఔషధ రంగంలో కీలక మార్పుకు దారితీయడంతో పాటు, అధిక బరువు సమస్యతో బాధపడుతున్న లక్షలాది మందికి ఆశాకిరణంగా నిలిచింది.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక




## జొమాటో ప్లాట్‌ఫామ్ ఫీజు పెంపు.. వినియోగదారులపై మరింత భారం

**హైదరాబాద్, మార్చి 20 (తెలంగాణ ముచ్చట్లు):** ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ రంగంలో ప్రముఖ సంస్థ జొమాటో మరోసారి వినియోగదారులకు షాక్ ఇచ్చింది. ప్రతి ఆర్డర్‌పై వసూలు చేసే ప్లాట్‌ఫామ్ ఫీజును పెంచుతూ తీసుకున్న నిర్ణయం నేటి నుంచి అమల్లోకి వచ్చింది. కార్యకలాపాల నిర్వహణ ఖర్చులు పెరగడం, అంతర్జాతీయంగా ముడి చమురు ధరల ప్రభావం వంటి కారణాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

ఇప్పటివరకు ప్రతి ఆర్డర్‌పై రూ.12.50గా ఉన్న ప్లాట్‌ఫామ్ ఫీజును కంపెనీ రూ.14.90కు పెంచింది. జీఎస్టీ కలిపి చూస్తే వినియోగదారులు ఒక్కో ఆర్డర్‌కు సుమారు రూ.17.50 వరకు కేవలం ప్లాట్‌ఫామ్ ఫీజుగానే చెల్లించాల్సి వస్తోంది. గత ఏడాది సెప్టెంబర్‌లోనే ఈ ఫీజును పెంచిన సంస్థ, ఆరు నెలలు కూడా గడవకముందే మళ్లీ పెంపు చేయడం గమనార్హం.

ఈ పెంపు ప్రభావం వినియోగదారులపై స్పష్టంగా పడనుంది. జొమాటో గోల్డ్ సభ్యులకు ఉచిత డెలివరీ సదుపాయం ఉన్నప్పటికీ, ప్లాట్‌ఫామ్ ఫీజు మాత్రం అందరికీ వర్తిస్తుంది. దీంతో చిన్న మొత్తాల ఆర్డర్లపైనా అదనపు భారం పడుతోంది. ఇదే బాటలో ప్రత్యర్థి సంస్థ స్విగ్గీ కూడా త్వరలో ఫీజులు పెంచే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

ఇటీవలి కాలంలో ముడి చమురు ధరలు పెరగడం వల్ల డెలివరీ ఖర్చులు గణనీయంగా పెరిగాయి. అలాగే కంపెనీలు లాభదాయకతను పెంచుకునే దిశగా కూడా ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నాయి. 2023లో కేవలం రూ.2తో ప్రారంభమైన ఈ ప్లాట్‌ఫామ్ ఫీజు, మూడు సంవత్సరాల్లోనే దాదాపు రూ.15కు చేరుకోవడం వినియోగదారుల్లో అసంతృప్తిని కలిగిస్తోంది.

సామాజిక మాధ్యమాల్లో పలువురు వినియోగదారులు ఈ తరచు ఫీజుల పెంపుపై విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. అయితే సంస్థలు మాత్రం సేవల నాణ్యతను మెరుగుపరచడానికి, డెలివరీ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఈ చర్యలు అవసరమని సమర్థించుకుంటున్నాయి. మొత్తానికి, ఆన్‌లైన్ ఫుడ్ ఆర్డర్లపై ఆధారపడే నగర జీవనశైలిలో ఈ తరహా ఫీజుల పెంపు వినియోగదారుల ఖర్చులను మరింత పెంచే అవకాశాలు కనిపిస్తున్నాయి.



## కుప్పకూలిన రూపాయి.. 93 దాటి చారిత్రక కనిష్ఠానికి

**హైదరాబాద్, మార్చి 20 (తెలంగాణ ముచ్చట్లు):** అంతర్జాతీయ ఆర్థిక పరిణామాల ప్రభావంతో భారత రూపాయి విలువ భారీగా క్షీణించింది. అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి చరిత్రలోనే కనిష్ఠస్థాయికి పడిపోవడం మార్కెట్లలో ఆందోళన కలిగిస్తోంది. శుక్రవారం ట్రేడింగ్‌లో రూపాయి విలువ ఒకేసారి 0.55 శాతం పడిపోయి డాలర్‌కు 93.12 వద్ద కొనసాగింది. బుధవారం నమోదైన 92.63 స్థాయిని కూడా ఇది దాటి కొత్త రికార్డు కనిష్ఠాన్ని నమోదు చేసింది. పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు, ప్రపంచ సరఫరా వ్యవస్థలో ఏర్పడిన అంతరాయాలు రూపాయి పతనానికి ప్రధాన కారణాలుగా భావిస్తున్నారు. ముఖ్యంగా ముడి చమురు ధరలు పెరగడం వల్ల దిగుమతి భారం అధికమై రూపాయిపై ఒత్తిడి పెరిగిందని నిపుణులు చెబుతున్నారు. అంతర్జాతీయంగా పెట్టుబడిదారులు సురక్షిత పెట్టుబడుల వైపు మొగ్గు చూపడంతో డాలర్‌కు డిమాండ్ పెరిగి రూపాయి మరింత బలహీనపడుతోంది. ప్రస్తుతం డాలర్‌రూపాయి మారకం 92.8 స్థాయికి పైగా ట్రేడ్ అవుతుండడం మార్కెట్‌లో కొనసాగుతున్న ఒత్తిడిని స్పష్టంగా చూపిస్తోంది. పశ్చిమాసియా సంక్షోభం ప్రారంభమైనప్పటి నుంచి రూపాయి విలువ దాదాపు 2 శాతం వరకు క్షీణించడం గమనార్హం.

ఇక మరోవైపు రూపాయి పతనం జరిగినప్పటికీ దేశీయ స్టాక్ మార్కెట్లు మాత్రం పుంజుకున్నాయి. సెన్సెక్స్ 900 పాయింట్లకు పైగా లాభపడగా, నిఫ్టీ దాదాపు 300 పాయింట్లు ఎగసింది. అయినప్పటికీ విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు మాత్రం అమ్మకాల వైపు మొగ్గు చూపుతున్నారు. గురువారం ఒక్కరోజే వారు రూ.7,558 కోట్లకు పైగా ఈక్విటీలను విక్రయించినట్లు సమాచారం.

ఇదిలా ఉంటే అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. ఇరాన్‌పై ఆంక్షలు సడలించే అవకాశాలపై అమెరికా నుంచి సంకేతాలు రావడంతో ధరలు తగ్గాయి. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 104.96 డాలర్లకు పడిపోగా, యూఎస్ డబ్ల్యూటీఐ క్రూడ్ ధర 92.47 డాలర్ల వద్ద ట్రేడ్ అయింది. అయినప్పటికీ గత కొన్ని వారాల్లో చమురు ధరలు గణనీయంగా పెరగడం వల్ల ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి కొనసాగుతోంది.

మొత్తానికి, రూపాయి విలువ పతనం దేశ ఆర్థిక పరిస్థితిపై ప్రభావం చూపే అవకాశాలు కనిపిస్తున్నాయి. దిగుమతులు ఖరీదవడం, ద్రవ్యోల్బణం పెరగడం వంటి పరిణామాలు ముందున్న రోజుల్లో ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేసే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# అప్పు వసూలు ఒత్తిడి ఆత్మహత్య ప్రేరేపణ కాదు

- సుప్రీంకోర్టు కీలక తీర్పు
- కేవలం డిమాండ్‌ను నేరంగా పరిగణించలేమని స్పష్టం
- గుజరాత్ కేసులో ఎఫ్ఐఆర్ రద్దు
- ఆధారాలు లేనప్పుడు కేసులు కొనసాగించరాదని వ్యాఖ్య



**న్యూఢిల్లీ, మార్చి 20 (తెలంగాణ ముచ్చట్లు):** అప్పు తిరిగి చెల్లించాలని అడగడం లేదా ఒత్తిడి చేయడం మాత్రమే ఆత్మహత్యకు ప్రేరేపించడం కిందకు రాదని సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు వెలువరించింది. కేవలం రుణం తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేయడాన్ని నేరంగా పరిగణించలేమని స్పష్టం చేసింది. ఈ మేరకు గుజరాత్‌కు చెందిన ఒక వ్యక్తిపై నమోదైన ఆత్మహత్య ప్రేరేపణ కేసును సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ కేసులో గుజరాత్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను తోసిపుచ్చుతూ జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కీలక తీర్పు ఇచ్చింది. మోర్బీ జిల్లాలో ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటనలో, పలువురు రుణదాతలు వేధించారని ఆరోపిస్తూ అతను రాసిన సూసైడ్ నోట్ ఆధారంగా పోలీసు కేసు నమోదు చేశారు. అందులో ఒకరైన ధీరూభాయ్‌పై ఐపీసీ సెక్షన్ 306, 506(2) కింద కేసు పెట్టారు.

ఈ కేసులో ప్రాసిక్యూషన్ సమర్పించిన కాల్ రికార్డుల ప్రకారం నిందితుడు మృతుడికి పలుమార్లు ఫోన్ చేసినట్లు పేర్కొన్నారు. అయితే ఈ ఆధారాలు ఆత్మహత్య ప్రేరేపణను నిరూపించడానికి సరిపోవని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. సూసైడ్ నోట్‌లో పలువురి పేర్లు ఉన్నప్పటికీ, ఎవరి పాత్ర ఏమిటో స్పష్టత లేకపోవడం గమనించిందని తెలిపింది. రుణదాత ఫోన్ చేసి అప్పు తిరిగి ఇవ్వాలని అడగడం చట్టబద్ధమైన చర్యేనని కోర్టు స్పష్టం చేసింది. ఎక్కువసార్లు ఫోన్ చేసినంత మాత్రాన దానిని నేరంగా పరిగణించలేమని పేర్కొంది. మృతుడిపై శారీరక దాడి లేదా బలవంతం జరిగినట్లు ఎలాంటి ఆధారాలు లేవని కూడా కోర్టు పేర్కొంది. ఈ నేపథ్యంలో నిందితుడిపై క్రిమినల్ కేసు కొనసాగించడం చట్ట దుర్వినియోగంగా మారుతుందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ధీరూభాయ్‌పై నమోదైన ఎఫ్ఐఆర్‌తో పాటు తదుపరి చర్యలను రద్దు చేస్తూ తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు భవిష్యత్తులో ఇలాంటి కేసులపై కీలక మార్గదర్శకంగా నిలవనుంది.

# నాటోపై ట్రంప్ ఆగ్రహం

- 'అమెరికా లేకుండా నాటో పేపర్ టైగర్' వ్యాఖ్యలు
- హర్మూజ్ జలసంధి విషయంలో సహకారం లేదని విమర్శలు
- ఇరాన్ యుద్ధంలో చేరలేదని నాటోపై మండిపాటు
- అధిక చమురు ధరలపై ద్వంద్వ వైఖరిని ఎత్తిచూపిన ట్రంప్



**వాషింగ్టన్, మార్చి 20 (తెలంగాణ ముచ్చట్లు):** హర్మూజ్ జలసంధిని తెరవడానికి ముందుకు రావాలని చేసిన విజ్ఞప్తిని నాటో దేశాలు పట్టించుకోకపోవడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రూత్ సోషల్ వేదికగా నాటో దేశాల వైఖరిని తీవ్రంగా విమర్శిస్తూ పలు వ్యాఖ్యలు చేశారు. అమెరికా లేకుండా నాటో కేవలం "పేపర్ టైగర్" మాత్రమేనని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇరాన్‌పై జరుగుతున్న యుద్ధంలో నాటో దేశాలు పాల్గొనడానికి ఇష్టపడడం లేదని విమర్శించారు. అణ్వాయుధాలు కలిగిన ఇరాన్‌ను ఎదుర్కొనే విషయంలో కూడా నాటో దేశాలు వెనుకంజ వేస్తున్నాయని అన్నారు. హర్మూజ్ జలసంధి తెరవడంలో సహకరించకపోవడంపై కూడా ట్రంప్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒక సాధారణ సైనిక విన్యాసంతో ఈ జలసంధిని తెరవొచ్చని, అయినప్పటికీ నాటో దేశాలు ముందుకు రావడం లేదని ఆరోపించారు. ఈ విషయంలో వారి వైఖరి బాధాకరమని పేర్కొన్నారు. అదేవిధంగా అధిక చమురు ధరలపై నాటో దేశాలు ఫిర్యాదు చేస్తున్నాయని, కానీ వాటి కారణాలను పరిష్కరించేందుకు సహకరించడం లేదని ట్రంప్ అన్నారు. ఈ ద్వంద్వ వైఖరిని ఆయన తప్పుబట్టారు. అవసరమైన సమయంలో సహకరించని దేశాలను తాము గుర్తుంచుకుంటామని హెచ్చరించారు. మొత్తంగా, నాటో దేశాల వ్యవహారశైలి పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన ట్రంప్, అంతర్జాతీయ భద్రతా అంశాల్లో తమ బాధ్యతను గుర్తించాల్సిన అవసరం ఉందని పరోక్షంగా సూచించారు.

# 9 గంటలు గాల్లో.. మళ్లీ ఢిల్లీకి చేరిన విమానం

- తప్పు విమానంతో ఎయిరిండియా గందరగోళం
- కెనడా నిబంధనల ఉల్లంఘనతో తిరుగు ప్రయాణం
- ప్రయాణికులకు అసౌకర్యం... సంస్థ క్షమాపణలు




**న్యూఢిల్లీ, మార్చి 20 (తెలంగాణ ముచ్చట్లు):** ఎయిరిండియా విమాన ప్రయాణికులకు అరుదైన అనుభవం ఎదురైంది. ఢిల్లీ నుంచి కెనడాలోని వాంకోవర్‌కు బయల్దేరిన ఏఐ185 విమానం గాల్లో ఏకంగా 9 గంటల పాటు ప్రయాణించి మళ్లీ ఢిల్లీలోనే ల్యాండ్ కావాల్సి వచ్చింది. కెనడా మార్గానికి అనుమతి లేని విమానాన్ని ఉపయోగించడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది. గురువారం మధ్యాహ్నం 12:18 గంటలకు బయల్దేరిన ఈ విమానం వాస్తవానికి బోయింగ్ 777300ఈఆర్ విమానం కావాల్సి ఉంది. కానీ పొరపాటున బోయింగ్ 777200ఎల్ఆర్ విమానాన్ని ఉపయోగించారు. విమానం నాలుగు గంటల ప్రయాణం అనంతరం చైనా గగనతలంలోకి ప్రవేశించిన తర్వాత ఈ తప్పిదం గుర్తించబడింది. దీంతో పైలట్లు వెంటనే విమానాన్ని వెనక్కి మళ్లించి ఢిల్లీకి తీసుకువచ్చారు.

ఈ ఘటనలో ప్రయాణికులు, సిబ్బంది సురక్షితంగా ఉన్నారని ఎయిరిండియా అధికారులు తెలిపారు. అయితే ప్రయాణికులు గంటల పాటు గాల్లో ప్రయాణించి తిరిగి రావాల్సి రావడంతో తీవ్ర అసౌకర్యం ఎదురైంది. దీనిపై సంస్థ చింత వ్యక్తం చేస్తూ క్షమాపణలు తెలిపింది. ప్రయాణికులకు హోటల్ వసతి కల్పించి, తదుపరి ప్రయాణానికి అవసరమైన ఏర్పాట్లు చేశామని సంస్థ వెల్లడించింది. మరుసటి రోజు ఉదయం మరో విమానంతో ప్రయాణికులను వాంకోవర్‌కు పంపినట్లు తెలిపింది. ఇలాంటి తప్పిదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొంది. గతంలో కూడా ఎయిరిండియా నిబంధనల ఉల్లంఘనలకు గురైన సందర్భాలు ఉన్నాయి. 2025లో సరైన సర్టిఫికెట్ లేకుండా విమానాలు నడిపినందుకు డీజీసీఏ సంస్థపై జరిమానా విధించిన విషయం తెలిసిందే. ఈ ఘటనతో ఎయిరిండియా నిర్వహణపై మరోసారి ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

# అమెరికాకు శ్రీలంక షాక్



- యుద్ధ విమానాలకు అనుమతి నిరాకరణ
- ఇరాన్ ఉద్రిక్తతల మధ్య తటస్థ వైఖరి స్పష్టం
- మట్టాల విమానాశ్రయంలో ల్యాండింగ్‌కు నో

**ఇంధన సంక్షోభంతో పనిదినాల తగ్గింపు**

**కొలంబో, మార్చి 20 (తెలంగాణ ముచ్చట్లు):** ఇరాన్‌తో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల మధ్య అమెరికాకు శ్రీలంక ఊహించని నిర్ణయం తీసుకుంది. తమ దేశానికి చెందిన రెండు యుద్ధ విమానాలను శ్రీలంకలో దిగేందుకు అనుమతించాలని అమెరికా చేసిన విజ్ఞప్తిని శ్రీలంక ప్రభుత్వం తిరస్కరించింది. యుద్ధ పరిస్థితుల్లో తాము తటస్థ విధానాన్నే అనుసరిస్తామని శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిస్సనాయకే పార్లమెంట్‌లో స్పష్టం చేశారు. అమెరికాకు చెందిన ఈ యుద్ధ విమానాలు ఆఫ్రికాలోని డిబౌటి ప్రాంతంలో ఉన్నట్లు అధ్యక్షుడు వెల్లడించారు. ఒక్కో విమానంలో ఎనిమిది సముద్ర యుద్ధ క్షిపణులు ఉన్నాయని తెలిపారు. ఇరాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో వ్యూహాత్మకంగా ఈ విమానాలను ఉపయోగించేందుకు శ్రీలంకలోని మట్టాల అంతర్జాతీయ విమానాశ్రయంలో నిలిపివేయాలని అమెరికా కోరింది. అయితే దీనికి శ్రీలంక స్పష్టంగా నిరాకరించింది.

ఈ అంశంపై అమెరికా ప్రతినిధులతో చర్చలు జరిగినప్పటికీ, తమ తటస్థ విధానంలో ఎలాంటి మార్పు ఉండబోదని దిస్సనాయకే పేర్కొన్నారు. మధ్యప్రాచ్య ఉద్రిక్తతల సమయంలో కూడా ఒత్తిళ్లు ఎదురైనా తాము తటస్థంగానే వ్యవహరించామని గుర్తుచేశారు. అదే విధానాన్ని ఇప్పటికీ కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అమెరికాతో జరిగిన చర్చల్లో సముద్ర మార్గాల రక్షణ, పోర్టుల భద్రత, వాణిజ్య సహకారం వంటి అంశాలు కూడా ప్రస్తావనకు వచ్చినట్లు తెలిపారు. ఇదే సమయంలో ఇరాన్ యుద్ధం ప్రభావం శ్రీలంకపై కూడా పడుతున్నట్లు పేర్కొన్నారు. సముద్ర పరిధిలో జరిగిన దాడుల్లో ప్రాణనష్టం చోటుచేసుకున్న ఘటనలను కూడా గుర్తుచేశారు.

ఇంధన కొరత తీవ్రతరం కావడంతో శ్రీలంక ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వారానికి నాలుగు రోజులే పని దినాలుగా ప్రకటించింది. ఇప్పటివరకు ఐదు రోజులుగా ఉన్న పనిదినాలను తగ్గించి బుధవారాన్ని కూడా సెలవుగా ప్రకటించింది. ఈ చర్యల ద్వారా ఇంధన వినియోగాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది.


## కొత్త ఫోన్లలో ఆధార్ యాప్ తప్పనిసరి అవుతుందా? కేంద్రం కీలక యోచన

**హైదరాబాద్, మార్చి 20 (తెలంగాణ ముచ్చట్లు):**

దేశంలో డిజిటల్ సేవలను మరింత సులభతరం చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకునే దిశగా అడుగులు వేస్తోంది. ఇకపై విడుదలయ్యే కొత్త స్మార్ట్‌ఫోన్లలో ఆధార్ యాప్ ముందుగానే ఇన్‌స్టాల్ చేసి ఉండేలా చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు స్మార్ట్‌ఫోన్ తయారీ కంపెనీలతో చర్చలు కొనసాగుతున్నట్లు సమాచారం.

దేశంలో ఇప్పటికే వంద కోట్లకు పైగా ప్రజలు ఆధార్ నమోదు చేసుకున్నారు. బ్యాంకింగ్, టెలికాం, ప్రభుత్వ సేవలు, విమానాశ్రయ సదుపాయాలు వంటి అనేక రంగాల్లో ఆధార్ వినియోగం విస్తృతమవుతోంది. ఈ నేపథ్యంలో వినియోగదారులు యాప్‌ను విడిగా డౌన్‌లోడ్ చేసుకోవాల్సిన అవసరం లేకుండా, ఫోన్‌లోనే ముందుగా అందుబాటులో ఉంచాలనేది ప్రభుత్వ ఉద్దేశంగా తెలుస్తోంది.

ఈ ప్రతిపాదనపై యూఐడీఏఐ సూచనల మేరకు ఐటీ శాఖ స్మార్ట్‌ఫోన్ కంపెనీలతో చర్చలు ప్రారంభించింది. జనవరి నెలలోనే ఈ ప్రణాళికను ప్రభుత్వం అంతర్గతంగా ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. క్యాలెండర్, గడియారం వంటి ప్రీలోడ్ యాప్‌ల మాదిరిగానే ఆధార్ యాప్ కూడా ఉండాలని కేంద్రం భావిస్తోంది.




అయితే ఈ నిర్ణయంపై ప్రముఖ టెక్ సంస్థలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఆపిల్, శాంసంగ్, అలాగే గూగుల్ వంటి కంపెనీలు వినియోగదారుల గోప్యత, భద్రత అంశాలను ప్రస్తావిస్తూ ఈ ప్రతిపాదనకు వ్యతిరేకంగా ఉన్నట్లు సమాచారం. ప్రతి దేశానికి వేర్వేరు ఫోన్ల మోడళ్లను తయారు చేయాల్సి రావడం వల్ల వ్యాపారపరమైన ఇబ్బందులు తలెత్తుతాయని కూడా వారు అంటున్నారు.

గతంలో కూడా సంచార్ సాథీ యాప్ను ఇదే విధంగా ఫోన్లలో తప్పనిసరిగా ఇన్‌స్టాల్ చేయాలని ప్రభుత్వం ప్రయత్నించింది. అయితే తీవ్ర వ్యతిరేకత రావడంతో ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాల్సి వచ్చింది. ఇప్పుడు అదే తరహాలో ఆధార్ యాప్ అంశం కూడా చర్చకు దారితీసింది. మొత్తానికి, వినియోగదారులకు సౌలభ్యం కల్పించడం లక్ష్యంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంటున్నప్పటికీ, గోప్యతా సమస్యలు, టెక్నాలజీ కంపెనీల అభ్యంతరాలు ఈ అంశాన్ని వివాదాస్పదంగా మార్చే అవకాశం కనిపిస్తోంది. భవిష్యత్తులో ఈ ప్రతిపాదనపై తుది నిర్ణయం ఎలా ఉంటుందో చూడాల్సి ఉంది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in